


# విజయభాను




విజయవాడ, గురువారం 07-09-2017 VIJAYABHANU DAILY VIJAYAWADA EDITION సంపుటి : 10 సంచిక : 95 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## 15న మద్య నియంత్రణ కోరుతూ
# చలో విజయవాడ



విజయవాడ: రాష్ట్రంలో అడ్డు అదుపులో లేకుండా సాగుతున్న మద్యం అమ్మకాలను నియంత్రించాలని, మద్యపానం వల్ల జరిగే నష్టాన్ని ప్రభుత్వమే ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని డిమాండ్ చేస్తూ మద్య వ్యతిరేక పోరాట ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీ రాష్ట్ర వ్యాప్తంగా చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తరువాయి 2లో

## రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్
## అండర్-19 వాలీబాల్ పోటీలకు జిల్లా జట్టు



విజయవాడ: కర్నూలులో వచ్చే నెల 7 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల స్కూల్ గేమ్స్ తరువాయి 2లో

## వెలుగులు తెచ్చే పండుగ
# జల సిరికి హారతి

శారదానదికి హారతిచ్చిన సీఎం బాబు

ప్రకృతిని ఆరాధించాలి..

జీవన ప్రమాణం పెంచుకోవాలి..

ముఖ్యమంత్రి చంద్రబాబు

కశింకోట: అన్ని పండుగల కంటే ముఖ్యమైన పండుగ జలసిరికి హారతి అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. విశాఖ జిల్లా కశింకోట మండలం నర్సాపురం గ్రామంలో



జలసిరికి హారతి కార్యక్రమానికి ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా శారదా నదికి హారతి ఇచ్చిన ముఖ్యమంత్రి.. నర్సాపురం ఆనకట్టను ప్రారంభించారు. అనంతరం బహిరంగ సభలో చంద్రబాబు మాట్లాడుతూ.. మన జీవితాలకు వెలుగులు తెచ్చే పండుగ జలసిరికి హారతి. మన జీవన ప్రమాణాలు సక్రమంగా ఉండాలంటే ప్రకృతిని ఆరాధించాలి. మనకు తిండినిచ్చే రైతులను గౌరవించడం మనందరి బాధ్యత. తరువాయి 2లో



## చర్చలతో ద్వైపాక్షిక సంబంధాలు
# బలోపేతం చేసుకుందాం



మయన్మార్ పర్యటనలో ప్రధాని మోది

ఆంగ్‌శాన్ సూచీతో మోదీ సమావేశం

నేపిడా: మయన్మార్ పర్యటనలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ బుధవారం ఆ దేశ స్టేట్ కౌన్సిలర్ ఆంగ్‌శాన్ సూచీతో భేటీ అయ్యారు. ఆ దేశ రాజధాని నేపిడాలో వీరిద్దరూ ఉన్నతస్థాయి చర్చల్లో పాల్గొన్నారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడంపై ఇరు నేతలు చర్చించినట్లు ప్రధాన తరువాయి 2లో

## 27న విజయవాడకు
# సీఎం కేసీఆర్



హైదరాబాద్ : ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు విజయవాడ పర్యటన ఖరారైంది. ఈ నెల 27న సీఎం కేసీఆర్ విజయవాడ వెళ్లనున్నారు. పర్యటనలో భాగంగా విజయవాడ కనక తరువాయి 2లో

# రూ.577 కోట్లు నష్టపోయాం

- ప్రింటింగ్ ప్రెస్‌లకు నోట్ల రద్దు ఎఫెక్ట్..
- ఆర్బీఐకి నివేదన




దిల్లీ : పెద్దనోట్ల రద్దు ప్రభావం ఆర్‌బీఐ ప్రింటింగ్ ప్రెస్‌లపై కూడా పడింది. నోట్ల రద్దు కారణంగా తాము రూ.577 కోట్లు నష్టపోయామంటూ పలు ప్రభుత్వ ప్రింటింగ్ ప్రెస్‌లు ఆర్‌బీఐకి నివేదించినట్లు సమాచారం. ఆ మొత్తాన్ని నష్టపరిహారంగా తిరిగి చెల్లించాలని కోరినట్లు తెలుస్తోంది.

గత ఏడాది నవంబర్ 8న రూ.500, రూ.1000 నోట్లను రద్దు చేస్తూ ప్రధాని నరేంద్ర మోదీ సంచలన నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే.

అప్పటికే ఆర్‌బీఐ ప్రింటింగ్ ప్రెస్‌లు ఆ నోట్ల ముద్రణ కోసం పెద్దఎత్తున్న కరెన్సీ నోట్ల పేపర్లను దిగుమతి చేసుకున్నాయి. నోట్ల ముద్రణ పని పురోగతిలో ఉండగా.. ఒక్కసారిగా పెద్దనోట్లను రద్దు చేస్తూ నిర్ణయం వెలువడింది. దీంతో ముద్రణ కోసం వినియోగించే ఇంక్, ఇతర మెటీరియల్స్ కూడా భారీగా వృథా అయ్యాయి. దీంతో తమకు నష్టపరిహారం చెల్లించాలని ప్రింటింగ్ ప్రెస్‌లు తరువాయి 2లో

## ఏటా వేలాది మంది
# రైతుల ఆత్మహత్యలు

### 17న విజయవాడలో రైతు రక్షణ యాత్ర

గుంటూరు: దేశ వ్యాప్తంగా గడిచిన రెండు, మూడు ఏళ్లల్లో వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు పేర్కొన్నారు.

ఈ నెల 17న విజయవాడలో జరగనున్న రైతు రక్షణ యాత్రను పురస్కరించుకుని గుంటూరు కొత్తపేట మల్లయ్య లింగం భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. రైతు సంఘం నాయకులు కొల్లా రాజమోహన్ అధ్యక్షత వహించారు. వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ విజయవాడ సిద్ధార్థ అకాడమీ ఆడిటోరియంలో కిసాన్ ముక్తి యాత్ర (రైతు రక్షణ యాత్ర), రైతాంగ సమరభేరిని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

దేశ వ్యాప్తంగా ఉన్న 150 రైతు సంఘాలు ఒకే గొడుగు కిందకు రావడం శుభపరిణామమని పేర్కొన్నారు. రైతు సమస్యల పరిష్కారం దిశగా అనుసరించాల్సిన అంశాలపై ప్రధానంగా చర్చించనున్నట్లు తెలిపారు. రైతులకు లాభసాటి ధరలు, శాశ్వత రుణ విముక్తి కల్పించాలనే డిమాండ్లపై దేశ వ్యాప్తంగా కిసాన్ ముక్తి యాత్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో జంతర్ మంతర్ సమీపాన ఆందోళనలు, పార్లమెంట్ సమావేశాలకు నమూనాగా రైతు పార్లమెంట్ సమావేశం నిర్వర్తించనున్నట్లు వివరించారు. దేశం అంతటా రుణమాఫీ, రైతు రుణ విమోచన చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. భూసేకరణ చట్టం 2013ను అన్ని రాష్ట్రాల్లో అమలు చేయాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు.

రైతు సంఘ రాష్ట్ర నాయకులు వై.కేశవరావు మాట్లాడుతూ రైతులకు ఎన్నికల సందర్భంలో ఇచ్చిన నాలుగు వాగ్దానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని తరువాయి 2లో


## గౌరీ లంకేశ్ హత్యపై నివేదిక కోరిన రాజ్‌నాథ్



బెంగళూరు: సీనియర్ జర్నలిస్టు గౌరీ లంకేశ్ దారుణ హత్యకు సంబంధించిన వివరాలను ఇవ్వాలని కర్ణాటక ప్రభుత్వాన్ని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ కోరింది. తక్షణం రాష్ట్ర ప్రభుత్వం నుంచి నివేదిక తెప్పించాలని కేంద్ర హోం శాఖ మంత్రి రాజ్‌నాథ్ హోం సెక్రటరీ రాజీవ్ గవుబాను ఆదేశించారు. హత్య వివరాలు, హంతకులను పట్టుకునేందుకు తీసుకుంటున్న చర్యలపై




## టేకిట్ ఈజీ



ఈసారి పుట్టేది ఎవరైనా తృప్తిపడు... మనవడే కావాలని పట్టుపట్టకు !!

## నదుల అనుసంధానంతో
# నీటి కొరతకు స్వస్తి పలకండి

- ఏపీలో 3 రోజులపాటు జలసిరికి హారతి
- మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు
- పాల్గొన్న మంత్రులు, ఉన్నతాధికారులు

విజయవాడ: నీటి ప్రాధన్యతను ప్రతీ ఒక్కరికీ తెలియజేయాలనే లక్ష్యంతో రాష్ట్ర వ్యాప్తంగా బుధవారంనుండి మూడు రోజుల పాటు జలసిరికి హారతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. బుధవారం వేమూరు నియోజకవర్గ పరిధిలోని కొల్లూరు మండల కేంద్రంలో గల కొల్లూరు లాకుల వద్ద ఏర్పాటు చేసిన జల సిరికి హారతి కార్యక్రమంలో జిల్లా మంత్రులు ప్రత్తిపాటి పుల్లారావు, నక్కా ఆనందబాబు, బాపట్ల పార్లమెంటు సభ్యుడు శ్రీరామ్ మాల్యాద్రి, జిల్లా కలెక్టర్ కోన శశిధర్, రేపల్లె శాసనసభ్యుడు అనగాని సత్యప్రసాద్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి పుల్లారావు మాట్లాడుతూ రాష్ట్రంలో నీటి ప్రాధాన్యతను తెలియజేసి, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని నీటిని సంరక్షించుటకు ప్రజల భాగస్వామ్యంతో రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్నదని అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా రాష్ట్రంలో నదుల అనుసంధానానికి శ్రీకారం చుట్టి దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. పట్టిసీమ ప్రాజెక్ట్ ద్వారా గోదావరి - కృష్ణా నదుల అనుసంధానం చేయడం ద్వారా నేడు కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాంతంలో తాగునీరు, సాగునీటికి కొరత లేకుండా పోయిందన్నారు. రాబోవు కాలంలో కృష్ణా - పెన్నా నదుల అనుసంధాన కార్యక్రమాన్ని కూడా చేపట్టడం తరువాయి 2లో

# ఉద్యానపంటల సాగుపై రాష్ట్ర బృందం పరిశీలన



చిల్లకూరు : ఎన్టీఆర్ జలసిరి, ఉపాధిహామీ పథకం సంయుక్త ఆధ్వర్యాన చేపట్టిన ఉద్యాన పంటల సాగు తీరుతెన్నులపై రాష్ట్ర బృందం క్షేత్రస్థాయి పరిశీలన చేసింది. ఈ బృందానికి ఎన్టీఆర్ జలసిరి ఉప కమిషనర్ శిల్ప నేతృత్వం వహించారు. ఈ క్రమంలోనే మండలంలోని పాలిచర్లవారిపాళెంలో ఉపాధి పథకం తవ్విన నీటి నిల్వ గుంతలను తనిఖీ చేశారు. అనంతరం ఓడూరు గ్రామాల్లో చేపట్టిన నిమ్మ సాగుపై రైతులతో చర్చించారు. చిల్లకూరులో ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. దానివల్ల కలిగే ప్రయోజనాలు, పంచాయతీకి ఒనగూరే లబ్ధి తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకొన్నారు. మండలంలో ఎన్టీఆర్ జలసిరి కింద దాదాపు 36 మంది దరఖాస్తు చేయగా కేవలం 13 బోర్లను మాత్రమే వేశారని, లక్ష్యాన్ని పూర్తిచేయడంలో ఎందుకు జాప్యం జరిగిందని విలేకరులు ప్రస్తావించారు. ఎక్కువ మంది ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారు దరఖాస్తు చేశారని, లబ్ధిదారుల వాటాను చెల్లించకపోవడంతో బోర్లను వేయలేకపోయామని సంబంధిత అధికారులు పేర్కొన్నారు. దీనిపై మండిపడ్డ ఆమె రెండు రోజుల్లో పూర్తిస్థాయి నివేదికలను అందజేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బృంద సభ్యులు రామకృష్ణ, లోకేశ్వర్‌రెడ్డి, విజయకుమార్, రాజాహుస్సేన్, గాలిరెడ్డి, కాశీ విశ్వనాథ్, ఎంపీడీవో విజయేంద్రకుమార్, ఏపీవో గిరిబాబు, స్థానిక సర్పంచి రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## జ్ఞాన జ్యోతులు



ఒంగోలులోని అంబేడ్కర్ భవన్‌లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వృత్తిలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన ఉపాధ్యాయులను పురస్కారాలతో సత్కరించారు. కార్యక్రమంలో భాగంగా డాక్టర్ సర్వేపల్లికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ విఠపు బాల సుబ్రహ్మణ్యం, జడ్పీ ఛైర్మన్ హరిబాబు, డీఈవో విజయభాస్కర్, జడ్పీ సీఈవో సాయికుమారి తదితరులుపాల్గొన్నారు.

## ప్రతీ వ్యక్తి జీవితంలో గురువు పాత్ర ఉంది

ఉపాధ్యాయుడు వైష్ణవచరణ్ సామల్

కటక్ : ప్రతీ వ్యక్తి జీవితంలో గురువు పాత్ర ఉంటుందని, వ్యక్తి ఎంత ఉన్నతస్థాయికి చేరుకున్నా తనను తీర్చిదిద్దిన గురువును మరవరాదు అని ఉపాధ్యాయుడు వైష్ణవచరణ్ సామల్ అన్నారు. గురుపూజోత్సవం సందర్భంగా డగర్‌పడా ప్రాంతంలో ఉన్న అనాథాశ్రమంలో ఒడిశా ప్రతిభా వికాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్య క్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. కార్య క్రమానికి అధ్యక్షత వహించిన ఒడిశా ప్రతిభా వికాస్ అధ్యక్షుడు యుధిష్టర్ ఖటువా మాట్లాడుతూ గురువుల ద్వారా దేశంలో మానవ వనరుల అభివృద్ధి జరుగుతోందన్నారు. ముఖ్యవక్తగా పాల్గొన్న రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ అధ్యక్షురాలు నమితా పండా ప్రసంగిస్తూ గురువులు సమాజానికి మార్గదర్శకులుగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా వివిధ పాఠశాలలకు చెందిన 30 మంది ఉపాధ్యాయులను అతిథులు శాలువాలు కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా సావనీర్ కూడా ఆవిష్కరించారు. నగరంలోని వివిధ పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు గురువులకు పూజించి ఆశీస్సులు పొందారు. పట్టాపుల్ ప్రాంతంలో ఉన్న కళింగ తెలుగు పాఠశాలలో పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఐక్యత అధ్యక్షుడు జి.కైలాష్‌రావు, పాఠశాల నిర్వహణ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## సహ కమిషనర్‌గా సుచేతన్ స్వరూప్



బెంగళూరు : రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్‌గా డాక్టర్ సుచేతన్ స్వరూప్ ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో నేర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో గవర్నరు వాజూభాయి వాలా ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, బెంగళూరు అభివృద్ధి శాఖ మంత్రి కేజే జార్జి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సుభాష్‌చంద్ర కుంటియా తదితరులు పాల్గొన్నారు.

## 12న నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

కర్నూలు : పిల్లల ఆరోగ్యంపై నులిపురుగల ప్రభావం ఎక్కువగా ఉంటోందని.. 18 సంవత్సరాలలోపు పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేయాలని కలెక్టర్ ఎస్.సత్య నారాయణ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం కింద నులిపురుగుల నివారణ దినోత్సవంపై జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈనెల 12న నులిపురుగుల నివారణకుగాను అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు వాటిని పంపించాలన్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తర్వాత పిల్లలకు ఈ మాత్రలు మింగించేలా పాఠశాల ఉపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేయాలన్నారు. జిల్లాలో 8 లక్షల మంది పిల్లలకు వీటిని పంపిణీ చేయాల్సి ఉందని, పిల్లల్లో రక్తహీనతను అధిగమిం చేందుకు 6 రకాల క్రిములు ఒక మాత్రతో చనిపోతాయని డీఎంహెచ్‌వో డా.నరసింహులు తెలిపారు. ఐసీడీఎస్ పీడీ జుబేదా బేగం, పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ డా.చంద్రశేఖర్, జబ్బార్ సమన్వయకర్త హేమలత, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పర్మిట్ రూమ్ పేరిట నిర్వహిస్తున్న దాబా మూసివేత

ఒంగోలు : ఒంగోలు మంగమూరు రోడ్డులో ఒక మద్యం దుకాణం వద్ద పర్మిట్ రూమ్ పేరిట నిర్వహిస్తున్న దాబాను ఎక్సైజ్ అధికారులు మూసి వేయించారు. మద్యం దుకాణానికి ఆనుకుని ఉన్న ఈ దాబాలో వంటకాలతో పాటు అనధికారికంగా మద్యం తాగడానికి అనుమతిస్తున్నారు. కేవలం మద్యం దుకాణానికి మాత్రమే ప్రభుత్వానికి రుసుము చెల్లిస్తూ.. అనధికారికంగా రెస్టారెంట్ తరహాలో దాన్ని నిర్వహిస్తున్నారు. సింగిల్ రోడ్డులో వాహనాలను అడ్డదిడ్డంగా నిలుపుతూ రాకపోకలకు ఆటంకం కలిగిస్తున్నారు.

## సారా అక్రమ వ్యాపారికి మెడలో జోళ్ల హారంతో వూరేగింపు

భువనేశ్వర్ : సారాను అక్రమంగా విక్రయిస్తున్న వ్యాపారి ముఖానికి మహిళలు మసి పూసి, మెడలో జోళ్ల హారం వేసి, దేహశుద్ధి చేసి గ్రామంలో వూరేగించారు. అనంతరం ఆబ్కారీ అధికారులకు అప్పగించారు. జగత్సింగ్‌పూర్ జిల్లా ఎరసమా ఠాణా పరిధిలో ఉన్న హరిష్‌పూర్ గ్రామంలో అక్రమంగా సారా వ్యాపారం నిర్వహిస్తుండడంతో గ్రామానికి చెందిన మహిళలు ప్రతిఘటించారు. పోలీసులు, ఆబ్కారీ అధికారులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోకపోవడంతో హరిష్‌పూర్ పంచాయతీలో ఉన్న పలు గ్రామాల మహిళలు ఒక్కటై ఝాన్సీరాణి మహిళా మహాసంఘం పేరిట ఒక సంఘాన్ని ఏర్పాటు చేశారు. తమ పంచాయతీని సారా రహితంగా చేసేందుకు ఆందోళనలు ప్రారంభించారు.

హరిష్‌పూర్‌లో అక్రమంగా సారా అమ్ముతున్నవారికి వీరు ముందుగా నోటీసులు జారీ చేసి అక్రమ అమ్మకాల దుకాణాలు మూసివేయాలని కోరారు. వ్యాపారులు పట్టించుకోకపోవడంతో హరిష్‌పూర్‌లో ఒక సారా దుకాణం ధ్వంసం చేయడంతోపాటు దాని యజమాని మహేశ్వర జెనాను పట్టుకొని దేహశుద్ధి చేశారు. ఆయన ముఖానికి మసిపూసి, మెడలో జోళ్ల హారం వేసి గ్రామంలో వూరే గించారు. అనంతరం ఆబ్కారీ అధికారులకు అప్పగించారు.

## ఎన్నికలు రాజ్యాంగం ప్రసాదించిన హక్కు

గోపాలపూర్ : ఎన్నికలు రాజ్యాంగం ప్రసాదించిన హక్కు అని, ఉన్నత విద్యాసంస్థల్లో ఇవి ఏటా నిర్వహించాలని లింగ్డో కమిషన్ సూచిస్తోందని, సాకులు చూపుతూ ఎన్నికలు రద్దు చేయడం తగదని ఏబీవీపీ పేర్కొంది. బ్రహ్మపుర విశ్వవిద్యాలయం(భంజవిహార్)లో ప్రత్యక్ష ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించాలని డిమాండ్ చేసింది. సంఘం నాయకులు ధరణీధర్ బెహర, డంబురురెడ్డి, బిప్రచరణ్‌లు ఆధ్వర్యంలో కొంతమంది విద్యార్థి ప్రతినిధులు ఉపకులపతిని కలిశారు.

దీనికి ముందుగా బిజద మద్దతుదారులైన విద్యా ర్థులు రతన్‌సెఠి నాయకత్వంలో ఆచార్య దేవీప్రసన్న పట్నా యక్‌ను కలిసి పరోక్ష పద్ధతిలో ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరిన విషయం విదితమే.

## పాతనోట్ల మార్పిడికి అవకాశం ఇవ్వండి

బెంగళూరు : చలామణి నుంచి ఉపసంహరించిన కరెన్సీ నోట్లను వినియోగించుకునేందుకు అవకాశం ఇవ్వాలని కోరుతూ ఉన్నత న్యాయస్థానం ముందుకు మంగళవారం ఒక అర్జీ వచ్చింది. అర్జీను విచారణకు స్వీకరించిన న్యాయస్థానం దీనిపై వివరణ ఇవ్వాలంటూ భారతీయ రిజర్వు బ్యాంకు, బీరూరు ఠాణా పోలీసులకు నోటీసులను జారీ చేసింది. వివరాల్లోకి వెళితే శివమొగ్గలోని క్యాంప్కో సహకార బ్యాంకులో 2015 ఏప్రిల్ 18న రాత్రి దొంగతనం జరిగింది. బ్యాంకులో రూ.4.82 లక్షలు దొంగతనమైందని గుర్తించి బీరూరు ఠాణా పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు బ్యాంకు సిబ్బంది ముగ్గురిని అరెస్టు చేసి రూ.2.53 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన మొత్తంతో ఇతర నిందితులు పరారీలో ఉన్నారని గుర్తిం చారు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న నగదును న్యాయస్థానం ఖజానాలో జమ చేశారు. గత ఏడాది నోట్ల రద్దు ప్రకటించిన తరువాత తమ నగదును విడుదల చేయాలని కోరుతూ క్యాంప్కో సహకార బ్యాంకు ప్రతినిధులు అర్జీ వేసుకున్నారు. విచారణ కొనసాగి ఈ ఏడాది మార్చి 8న నగదు విడుదల చేయాలని స్థానిక న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. అయినా మే 21వరకు నగదు విడుదల కాలేదు. ఆ నోట్లను మార్చుకునేందుకు అవకాశం ఇవ్వాలంటూ రిజర్వు బ్యాంకుకు సహకార బ్యాంకు ప్రతినిధులు లేఖ రాయగా, అందుకు అవకాశం లేదంటూ సమాధానం వచ్చింది. దీన్ని ప్రశ్నిస్తూ బ్యాంకు ప్రతినిధులు ఉన్నత న్యాయస్థానంలో అర్జీ వేసుకున్నారు.

## జనం ఆకలి తీర్చడమే కర్తవ్యం



బెంగళూరు : బడుగు జనుల ఆకలి తీరుస్తున్న ఇందిరా క్యాంటీన్లలో త్వరగా ఆహార పదార్థాలు ఖాళీ కావడం పట్ల పీసీసీ అధ్యక్షుడు డాక్టర్ పరమేశ్వర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. వచ్చిన వారందరికీ ఎందుకు వితరణ చేయలేక పోతున్నారని సిబ్బందిని ప్రశ్నించారు. మాకు కేవలం 150 ప్లేట్ల ఉపాహారం మత్రమే పంపించారు. వాటినే విక్రయించాం అని సమాధానం రావడంతో పరమేశ్వర్ పెదవి విరిచారు. వెంటనే ఆయన పాలికె కమిషనర్ మంజునాథ్ ప్రసాద్‌కు ఫోన్ చేసి ప్రశ్నించారు. ఎక్కువ మందికి ఆహారం అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. న్యూబీఈఎల్ మార్గంలోని ఇందిరా క్యాంటీన్‌కు శాసనసభ్యులు మునిరత్న, సోమశేఖర్, భైరతి బసవరాజ్‌లతో కలిసి పరమేశ్వర్ చేరుకున్నారు. ఉపహారాన్ని ఆరగించారు. గంగానగరలోని ఆహారాలయానికీ చేరుకున్నారు. అప్పటికే అక్కడ అన్నీ ఖాళీగా కనిపించాయి. ఉపహారం కోసం వచ్చిన వారు వెనక్కి వెళ్లడం గమనించారు. పరిస్థితిని గమనించిన ఆయన సిబ్బందిని వాకబు చేశారు. నిత్యం మూడు వందల మందికి ఆహారం సరఫరా చేయాల్సిన డిమాండుందని- ఇక్కడ 150 టోకెన్లు మాత్రమే అందుబాటులో ఉంటున్నాయని కార్మికులు పరమేశ్వర్‌కు వివరించారు. పరమేశ్వర్ విలేకరులతో మాట్లాడుతూ యలహంక ఇందిరా క్యాంటీన్‌లో నాణ్యతలేని ఆహారం సరఫరా చేస్తున్నట్లు సమాచారం వచ్చిందని చెబుతూ.. ప్రారంభంలో కొన్ని సమస్యలు తలెత్తుతాయని- నిదానంగా వాటిని పరిష్కరిస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఈ పథకాన్ని జిల్లా, తాలూకా కేంద్రాల్లో ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నిర్ణయించిన విషయాన్ని గుర్తు చేశారు. కడుపు నిండిన భాజపా నేతలు ఆ పథకాన్ని నిత్యం విమర్శిస్తున్నారని ధ్వజమెత్తారు. మేమంతా పేదల తరఫున ఉన్నామని- అందుకే అన్నభాగ్య, ఇందిరా క్యాంటీన్లను ప్రారంభించామని తెలిపారు.

మొదటి పేజీ తరువాయి

## వెలుగులు తెచ్చే పండుగ జలసిరికి హారతి

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పింఛను రూ.వెయ్యికి పెంచాం. నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నాం. ఆడబిడ్డలు ఆత్మగౌరవంతో బతకాలనే డ్వాక్రా సంఘాలు పెట్టాం. మహిళల కోసం దీపం పథకంతీసుకొచ్చాం. భవిష్యత్తులో 80శాతం ప్రజలు సంతోషంగా ఉండేలా పాలన అందిస్తాం. ప్రజలకు మేలు చేస్తున్న పార్టీలను అందరూ ఆదరించాలి అని అన్నారు.

## చర్చలతో ద్వైపాక్షిక సంబంధాలు బలోపేతం చేసుకుందాం

మంత్రి కార్యాలయం వెల్లడించింది. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. పొరుగుదేశమైన మయన్మార్‌తో భారత్ బంధం మరింత పటిష్ఠంగా ఉండాలి. సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్‌లో భాగంగా మయన్మార్ అభివృద్ధికి మేం సహకారం అందిస్తాం అని హమీ ఇచ్చారు.

చైనాలోని బ్రిక్స్ సదస్సుకు హాజరైన ప్రధాని మోదీ.. మంగళవారం అక్కడి నుంచి మయన్మార్ వెళ్లిన విషయం తెలిసిందే. నిన్న సాయంత్రం నేపిడా చేరుకున్న మోదీ.. ఆ దేశాధ్యక్షుడు టిన్‌గ్యాతో చర్చలు జరిపారు. ద్వైపాక్షిక పర్యటన నిమిత్తం మయన్మార్ రావడం ఇదే తొలిసారి. 2014లో ఆసియాన్-భారత్ సదస్సు కోసం మోదీ వచ్చినా.. అది ద్వైపాక్షిక పర్యటన కాదు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడం, భద్రతకు సంబంధంచిన సహకారంపై చర్చలు జరిపేందుకు మోదీ ఈ పర్యటన చేపట్టారు.

## గౌరీ లంకేశ్ హత్యపై నివేదిక కోరిన రాజ్‌నాథ్

కూడా వివరాలు ఇవ్వాలని కర్ణాటక ప్రభుత్వానికి కేంద్రం సూచించింది. కాగా, గౌరీ లంకేశ్ హత్యను ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సైతం సీరియస్‌గా తీసుకున్నారు. ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని, వ్యక్తిగతంగా తానో మంచి స్నేహితురాలిని కోల్పోయానని చెప్పారు. నిందితులను విడిచిపెట్టే ప్రసక్తే లేదని, త్వరలోనే పట్టుకుంటామని అన్నారు. ఈ హత్యపై సిట్ దర్యాప్తు జరుపనున్నామని, గౌరీ లంకేశ్ కుటుంబ సభ్యులు కోరితే సిబీఐ దర్యాప్తునకు కూడా వెనుకాడేదని లేదని తెలిపారు. హత్య వెనుక కుట్ర కోణం ఉందా లేదా అనేది తాను ఇప్పుడే చెప్పలేదని, ఇటీవల తాను గౌరీ లంకేశ్‌ను కలిసినప్పుడు తనకు ఎలాంటి ప్రాణహాని ఉన్న విషయాన్ని తనకు చెప్పలేదని అన్నారు. కల్బుర్గి, పన్సారే, దభోల్కర్ హత్యలకు ఉపయోగించిన తరహా ఆయుధాలనే ఈ హత్యకూ వాడారని సిద్ధరామయ్య చెప్పారు.

## రూ.577 కోట్లు నష్టపోయాం

కోరుతున్నాయి. దేశవ్యాప్తంగా ఉన్న నాలుగు కరెన్సీ ప్రింటింగ్ ప్రెస్‌లు నోట్ల రద్దు కారణంగా వాటిల్లిన నష్టాల లెక్కలు వేసి ఆర్‌బీఐకి పంపించినట్లు సమాచారం. ఇందులో రెండు ప్రింటింగ్ ప్రెస్‌లు ప్రభుత్వ రంగ సెక్యూరిటీ ప్రింటింగ్ అండ్ మింటింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌కు చెందినవి. ఇవి నాసిక్, దెవాస్‌లో ఉన్నాయి. మరో రెండు భారతీయ రిజర్వ్ బ్యాంక్ నోట్ ముద్రణా ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందినవి. ఇవి మైసూర్, సల్బోని ప్రాంతాల్లో ఉన్నాయి. ఈ నష్టాలపై చర్చ జరుగుతున్నట్లు సంబంధిత ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు.

## 27న విజయవాడకు సీఎం కేసీఆర్

దుర్గమ్మకు ముక్కుపుడక సమర్పించనున్నారు కేసీఆర్. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే దుర్గమ్మకు ముక్కుపుడక సమర్పిస్తానని సీఎం మొక్కుకున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో సీఎం తెలంగాణ మొక్కులు తీర్చుకుంటున్నారు. ఇప్పటి వరకు సీఎం కేసీఆర్.. భద్రకాళి అమ్మవారికి బంగారు కిరీటం, స్వర్ణపత్రాలు, తిరుమల వెంకన్నకు స్వర్ణ సాలిగ్రామహారం, స్వర్ణ కంఠాభరణాలు, కురవి వీరభద్రుడికి బంగారు మీసం సమర్పించిన విషయం విదితమే.

## నదుల అనుసంధానంతో నీటి కొరతకు స్వస్తి పలకండి

జరుగుతుందన్నారు. రాష్ట్రంలో వున్న 40 నదులు, వాటిపై నిర్మించిన జలాశయాలు, 40 వేలకు పైగా చెరువులు, 1130 లిఫ్టులు, 15 లక్షలకు పైబడి వ్యవసాయ బోర్లు, ఇతర నీటి వనరులు మన అవసరాలను తీరుస్తున్నాయని, వీటిని సమర్థవంతంగా వినియోగించుకోగలిగేలా జల వనరుల శాఖ ద్వారా అనేక కార్యక్రమాలు అమలు చేస్తూ, రాష్ట్రాన్ని కరవు రహిత రాష్ట్రంగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు.

రాష్ట్ర సాంఘిక మరియు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనందబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో 80 శాతం మంది ప్రజలు వ్యవసాయ ఆధారిత జీవనం గడుపుచున్నారని, వ్యవసాయానికి అవసరమగు సాగునీటి విలువ, ప్రాధాన్యతను ప్రజల్లో తెలియజేయుటకు మరియు ఆ నీటిని పూజించేలా జలసిరికి హారతి కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. ప్రతీ వర్షపు నీటి చుక్కను ఒడిసిపట్టి భూగర్భ జలాలుగా మార్పుచేసుకునేందుకు పెద్ద ఎత్తున నిధులు ఖర్చుపెట్టి రాష్ట్ర ప్రభుత్వం నీరు - చెట్టు, సేద్యపు కుంటల నిర్మాణం, ఇంకుడు గుంతలు, కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. భవిష్యత్తు తరాలను దృష్టిలో పెట్టుకుని ఇంకుడు గుంటల పథకాన్ని తీసుకువచ్చిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. 50 కోట్ల రూపాయలతో పోతర్లంక ఎత్తిపోతల పథకాన్ని చేపట్టడం జరిగిందని, 50 శాతం మేర పనులు కూడా పూర్తి అయినట్లు మంత్రి తెలిపారు.

బాపట్ల పార్లమెంట్ సభ్యుడు శ్రీరామ్ మాల్యాది మాట్లాడుతూ సకల ప్రాణికోటి మనుగడ నీటి పైనే ఆధారపడి వుందని, నీరున్నచోటే నాగరికత జీవనం సాగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పట్టి సీమ ప్రాజెక్ట్ ద్వారా నదుల అనుసంధాన కార్యక్రమాన్ని చేపట్టి దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. రాష్ట్రంలో ఒక కోటి కుటుంబాలకు లబ్ధిచేకూరేలా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు.

జిల్లా కలక్టర్ కోన శశిధర్ మాట్లాడుతూ నీరే జీవం, జీవమే నీరు, నీరు లేకపోతే ప్రగతి లేదని, నీటిని సంరక్షించుకోవలసిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. జల సంరక్షణ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, సాగునీటి సఘాలను, రైతులను, ప్రజలను భాగస్వాములను చేసి, ఆవ గ్రామ అవసరాలను దృష్టిలో వుంచుకుని సూక్ష్మ ప్రణాళికలను రూపొందించుకోవాలన్నారు. జిల్లాను నాగార్జున సాగర్ కుడి కాలువ ప్రాంతంగా, కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాంతంగా మరియు గుంటూరు ఛానెల్ ప్రాంతంగా విభజించడం జరిగిందని, గత సంవత్సరం సాగునీటి అవసరాలకు గాను 75 టిఎంసిల నీరు అవసరం కాగా, 45 టిఎంసిల నీరు మాత్రమే అందుబాటులో ఉన్నప్పటికీ, జిల్లా యంత్రాంగం, రైతులు చేపట్టిన ప్రత్యేక యాజమాన్య పద్ధతుల వలన దేశంలో ఎక్కడా లేని విధంగా అత్యధిక దిగుబడి సాధించడం జరిగిందన్నారు. రేపల్లె శాసనసభ్యులు అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ రాబోవు రోజుల్లో నీటి అవసరాలను దృష్టిలో వుంచుకుని రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున జల సంరక్షణ కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. ఈ జల సంరక్షణ కార్యక్రమాలలో ప్రజలు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. తొలుత జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించి, జలసిరికి హారతిపై ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించారు. చివరగా జల సంరక్షణపై ప్రజలచే మంత్రి ఆనందబాబు ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ రాయలు, జలవనరుల శాఖ ఎస్ఇ చౌదరి, జిల్లా అధికారులు, మండల ప్రజా ప్రతినిధులు, రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## 15న మద్య నియంత్రణ కోరుతూ చలో విజయవాడ

మహిళా సంఘాలు తెలిపాయి. హనుమాన్‌పేట సీపీఐ భవన్‌లో ఈ సందర్భంగా మహిళా సంఘాలు ఆధ్వర్యంలో కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమానికి మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మొత్స దుర్గాభవానీ, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ, విప్లవ మహిళా సంఘం నాయకురాలు ఎం.సాయుధలు పాల్గొని వివరాలు వెల్లడించారు. ఛలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రం నుంచి మహాప్రదర్శన, అలంకార్ కూడలి వద్ద బహింగసభ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పోరాటాలు నిరసనలు ఫలితంగా రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో బెల్టు దుకాణాలు నియంత్రించామన్నారు. అయితే ఇటీవల మొబైల్ మద్యం అమ్మకాలు జరుగుతున్నాయని ఆరోపించారు. రెండు నెలలుగా రాష్ట్ర వ్యాప్తంగా బెల్టుషాపుల వద్ద ఆందోళనలు సాగిస్తున్న మహిళలపై అక్రమకేసులు పెడుతున్నారని ఆరోపించారు. గుడి, బడి, జనావాశాల మధ్య కాకుండా వ్యాపార సముదాయాల సమీపంలోనే మద్యం విక్రయించేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో మహిళా సంఘాల నాయకులు పంచదార్ల దుర్గాంబ, ఓర్సుభారతి, కె.దుర్గ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్‌కు అండర్-19 వాలీబాల్ పోటీలకు జిల్లా జట్టు

అండర్-19 బాలుర వాలీబాల్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టు ఎంపిక పోటీలను స్థానిక ఇందిరాగాంధీ నగరపాలక సంస్థ స్టేడియంలో నిర్వహించారు. ఎంపిక పోటీల్లో జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి 63 మంది క్రీడాకారులు హాజరయ్యారు. జట్టు సభ్యులు: ఎం.హర్షవర్ధన్, పి.బాలరాజు, ఎస్‌కేసాదిక్ (ఆంధ్రా లయోలా కళాశాల), కె.దుర్గాప్రసాద్, టి.అఖిల్‌బాబు (పీబీ సిద్ధార్థ కళాశాల), కె.శ్రీనివాస్, ఎం.సైదా (ఎస్సారార్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల), సీహెచ్‌భాస్కర రావు, ఎస్.సునీల్ (సెవెన్త్ డే అడ్వెటిస్ట్ జూనియర్ కళాశాల, నూజివీడు), కె.సుధీర్‌కుమార్ (ఏజీఎస్‌జీ సిద్ధార్థ కళాశాల, ఉయ్యూరు), జి.మల్లికార్జునరావు (శాతవాహన కళాశాల).

## ఏటా వేలాది మంది రైతుల ఆత్మహత్యలు

అన్నారు. ఈ నెల 18న అనంతపురం జిల్లాలో జరగనున్న యాత్ర, సమావేశాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర నాయకులు నాగేంద్రనాథ్, నాగిరెడ్డి, కేవీ.ప్రసాద్, పీఏస్‌అజయ్‌కుమార్, కుమారస్వామి, ఎం.రమేష్‌బాబు పలువురు రైతు సంఘాల నాయకులు మాట్లాడారు.

# విజయవాడ ప్రాంతీయ వార్తలు

ఉపాధి హామీ పని తీరుపై

## రాష్ట్ర డైరెక్టర్ ఆరా



గూడూరు : గూడూరు మండలంలోని 23 పంచాయతీల పరిధిలో జరుగుతున్న ఉపాధి హామీ పథక పని తీరు బాగుందని, ఉపాధి హామీ సిబ్బంది కూడా నిబద్ధతతో పని చేస్తున్నట్లు ఉపాధి హామీ పథక రాష్ట్ర డైరెక్టర్ సురేంద్రబాబు తెలిపారు. గూడూరు మండలం ఎంపీడీవో కార్యాలయంలో ఉన్న ఉపాధి హామీ పథకం కార్యాలయంలో ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్య మంత్రి పేద ప్రజలు ఆర్థికంగా ఎదిగేలా ఉపాధి హామీ పథకాన్ని ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకొన్నారని, ప్రతి గ్రామంలో ఉపాధి కల్పించి వారికి రోజుకు రూ.197 గిట్టుబాటు అయ్యేలా పని కల్పించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భవాని, తెదేపా నాయకులు ఇస్రాయిల్‌కుమార్, ఉపాధి హామీ సిబ్బంది ఉన్నారు.

రాష్ట్రంలో 84

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు

### మంత్రి కామినేని శ్రీనివాస్

చినగంజాం: చినగంజాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో 1.18 కోట్ల నేషనల్ హెల్త్ మిషన్ నిధులతో నిర్మించనున్న 8 పడకల భవనానికి రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ బుధవారం శంకుస్థాపన చేశారు. ప్రకాశం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు నిధులు రూ.18 లక్షలతో రెవెన్యూ కార్యాలయ ఆవరణలో నిర్మించిన చింతగుంపల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం భవనాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 84 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను మంజూరు చేసినట్లు తెలిపారు. ఇందుకు కేంద్ర మంత్రిగా ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు పనిచేసిన కాలంలో మంచి సహాయ సహకారాలు అందించారన్నారు. మారుతున్న వాతావరణ మార్పులకు అనుగుణంగా ప్రజలు తమ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పరుచూరు ఎమ్మెల్యే ఏలూరు సాంబశివరావు, జిల్లా కలెక్టర్ వినయ్‌చంద్, పలు శాఖలు అధికారులు పాల్గొన్నారు.

## గ్రామీణ సమస్యల పరిష్కారానికి పల్లెపిలుపు

అవుకు: గ్రామీణ సమస్యల పరిష్కారానికి పల్లెపిలుపు కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని అవుకు మండల నోడల్ అధికారి విశ్వనాథరెడ్డి అన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు ప్రతి సమస్యను గుర్తించి పరిష్కరించాలని సూచించారు. గత రెండు నెలలుగా నిర్వహించిన కార్యక్రమాల వివరాలను, ప్రగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, చౌక దుకాణాలు, పాఠశాలల పనితీరును ఎప్పటికప్పుడు గమనించాలని, అక్రమాలకు అవకాశం లేకుండా చూడాలని ఆయన అధికారులకు సూచించారు. సమావేశంలో తహసీల్దారు సంజీవయ్య, ఎంపీడీవో వెంకటేశ్వర్‌రెడ్డి, విద్యాధికారి శ్రీధర్‌రావు, వ్యవసాయాధికారి శ్రీకృష్ణ, పంచాయతీరాజ్ ఏఈ భాష, ఇతర శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

## కనువిందుగా సుబ్రహ్మణ్యస్వామికి ఫలాభిషేకం

చిట్టమూరు : చిట్టమూరు మండలంలోని మల్లాం గ్రామంలో శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి 21 రకాలు పండ్లతో అభిషేకాలు చేశారు. అరటిపండ్లు, బత్తాయి పండ్లు, ఆపిల్ పండ్లు, ద్రాక్ష, దానిమ్మ, జామ, ఆరంజి, చర్రీ, పైనాపిల్, సపోటా, కర్జూరం, పనస, చక్కెర, పాలు, పెరుగు, తేనె, నెయ్యి, నీళ్లు, పంచామృతం, మొదలైన రకాలు అభిషేకాలు నిర్వహించారు. ఆలయంలో అభిషేకాలు చూసేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఛైర్మన్ పాపారెడ్డి వెంకట సుబ్బారెడ్డి, దేవదాయశాఖ సహాయ కమిషనర్ వేగూరు రవీంద్రరెడ్డి, ఈవో రమణారెడ్డి పర్యవేక్షణలో ఉత్సవాలు వైభవంగా జరిగాయి. రాత్రి నందీవాహనంపై గ్రామంలో వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామిని గ్రామంలో వూరేగింపు ఉత్సవం నిర్వహిం చారు. కనుల పండువగా ఉత్సవాలు జరుగుతున్నాయి.

## బీసీలకు న్యాయం చేయాలి

గూడూరు : గుంటూరు ప్రాంతంలో ఆత్మహత్యకు పాల్పడిన విద్యార్థిని జయశ్రీ కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని, ఆత్మహత్యకు గల కారణాలపై విచారణ చేపట్టాలని సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉల్లిపాయల శంకరయ్య డిమాండ్ చేశారు. గూడూరు రెండో పట్టణంలోని మాళవ్యానగర్‌లో సీమాంధ్ర గూడూరు డివిజన్ సంఘం కార్యాలయంలో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్రంలోని ప్రైవేటు విద్యాసంస్థలో చదువుతున్న విద్యార్థినులకు రక్షణ కరవైందని, ఆవేదన వ్యక్తం చేశారు.

## కుమారగౌడ ఆశయ సాధనకు కృషి

### సంస్మరణ సభలో నాయకులు

ఆదోని : తెదేపా నేత, ఎల్లెల్సీ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్, రాష్ట్ర అపెక్స్ కమిటీ సభ్యుడు కుమార్‌గౌడ ఆశయ సాదనకు అందరూ కృషి చేద్దామని ఆలూరు తెదేపా నియోజకవర్గ బాధ్యులు వీరభద్రగౌడ అన్నారు. ఆదోని మార్కెట్ యార్డు సమీపంలోని బి.ఎం.బి.జి. పత్తి జిన్నింగ్ పరిశ్రమంలో కుమారగౌడ సంస్మరణ సభ నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి తెదేపా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున హాజరై ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీరభద్రగౌడ మాట్లాడుతూ తెదేపా కార్యకర్తలు, అభిమానుల ప్రోత్సాహం ఇలానే ఉంటే ఆలూరు నియోజక వర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసి కుమార్‌గౌడ ఆశయాలను నెరవేరుస్తామన్నారు. ఎల్లెల్సీ ఛైర్మన్‌గా బాధ్యలు చేపట్టిన నాటి నుంచి నీటి వాటా రాబట్టేందుకు విశేషంగా కృషి చేశారని వక్తలు కొనియాడారు. అనంతరం అన్నదానం చేశారు.

ఈ కార్య క్రమంలో తెదేపా సీనియర్ నాయకులు ఉమాపతినాయుడు, వీరశైవ లింగయతి మహాసభ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్, తెదేపా జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసరెడ్డి, ఆలూరు జడ్పీటీసీ సభ్యుడు రాంభీంనాయుడు, ఆలూరు, ఆదోని నాయ కులు శేషగిరి, రాంనాథ్‌యాదవ్, నర్సప్ప, డీఎస్పీ కొల్లి శ్రీనివాసరావు, ఏడీఏ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణకు రద్దీ కూడళ్లలో విస్తృత గస్తీ

చీరాల : ప్రజలలో ధైర్యం పెంపొందించేందుకు వారిలో ఆత్మవిశ్వాసాన్ని కల్పించేందుకు రద్దీ కూడళ్లలో నడక గస్తీ (ఫుట్ పెట్రోలింగ్)ను ప్రారంభిస్తున్నట్లు ఎస్పీ బి.సత్య ఏసుబాబు పేర్కొన్నారు. మంగళవారం చీరాల ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఆయన తనిఖీలు చేపట్టి, దస్త్రాలను పరిశీలించారు. పెండింగ్ కేసుల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రద్దీ ప్రాంతాలలో నేరాలను నియంత్రించేందుకు త్వరలో ఫుట్ పెట్రోలింగ్‌ను ప్రారంభిస్తున్నామని, ఇందులో భాగంగా పోలీసులు రద్దీ ప్రాంతాలలో తిరుగుతుంటారన్నారు. దీనివల్ల నేరస్థులు యథేచ్ఛగా బహిరంగ ప్రదేశాల్లో తిరిగే వీలుండదని, సామాన్య ప్రజలకు భరోసా కూడా లభిస్తుందన్నారు. ద్విచక్ర వాహనాలపై తిరిగే వారు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలన్నారు. దీంతోపాటు మద్యం తాగి వాహనాలు నడిపే వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు. దొంగతనాలు నివారించడానికి కొత్త విధానం ప్రవేశపెట్టామన్నారు. స్మార్ట్ ఫోన్‌లలో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని బయటకు వెళ్లే సమయంలో సమాచారం ఇస్తే ఆ ఇంటికి పోలీసుల రక్షణ ఉంటుందన్నారు. స్మార్ట్ ఫోన్‌లు లేనివారు ఇనస్పెక్టర్‌కు ఫోన్‌చేసి సమాచారం ఇస్తే దాన్ని కూడా పరిగణనలోకి తీసుకొని రక్షణ కల్పిస్తామన్నారు. దీన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చీరాలో 192 కేసులు దర్యాప్తులో ఉన్నాయని, వీటిలో 4 కేసు లకు మాత్రమే ఆధారాలు లభించాల్సి ఉంద న్నారు. చీరాలలో డ్రంక్, డ్రైవ్ శిరస్త్రాణం విషయంలో అవగాహన బాగుందన్నారు.

## ప్రజలను నట్టేట ముంచిన ప్రభుత్వాలు

### సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగేశ్వరరావు



ఫత్తేఖాన్‌పేట : కేంద్రంలో అధికారంలోకి వచ్చిన భాజపా ప్రభుత్వం ప్రజలను నట్టేట ముంచిందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు తెలిపారు. సంతపేట సీపీఐ కార్యాలయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న ప్రజావ్యతిరేక కార్యక్రమాలపై విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులు, మైనార్టీల వూచకోత, వారిపై అత్యాచారాలు, హత్యలు ఇవి చాలవన్నట్లు ఏమి తినాలో, ఏమి తినకూడదో అని ప్రజలను వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సమస్యలు విలయతాండవం చేస్తుంటే 2019లో ఎలా అధికారంలోకి రావాలని ఆలోచించడం తప్ప ప్రజలు బాగోగులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వాన్ని పశ్నించాల్సిన ప్రధాన ప్రతిపక్షం ఆ దిశగా అడుగులు వేయడంలో విఫలమైందని ఎద్దేవా చేశారు.

అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవాలి

అగ్రిగోల్డ్ బాధితుల రాష్ట్ర వ్యాప్త చైతన్యయాత్ర నెల్లూరుకు చేరుకుంది. సంతపేట సీపీఐ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు ర్యాలీ నిర్వహిం చారు. రోటరీ క్లబ్ వద్ద జరిగిన బహిరంగసభలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 20 లక్షల కుటుంబాలు అగ్రిగోల్డ్ బాధితులు ఉంటే వారి డబ్బులు ఇప్పించకుండా కోర్టుల పేరుతోకాలయాపన చేస్తున్నారన్నారు. ఇదే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తే మరో చారిత్రాత్మక ఉద్యమానికి సిద్ధం కావాల్సి వస్తుందని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.పార్థసారధి, ఏఐటీ యూసీ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, సీపీఐ నగర కార్యదర్శి ఎస్‌కే మునీర్, ఎస్‌కే కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

## అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

కర్నూలు : ప్రతి ఎకరాలకు సాగునీరు ఇవ్వాలనే కృత నిశ్చయంతో సాగునీటి ప్రాజెక్టులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని.. ఈ నిర్దిష్టమైన లక్ష్యాన్ని నెరవేర్చేందుకు కొత్త ఇంజినీర్లు మరింత ఉత్సాహం, అంకితభావంతో విధులు నిర్వర్తించాలని జలవనరుల శాఖ ముఖ్య ఇంజినీరు (సీఈ) సి.నారాయణరెడ్డి కోరారు.. నీటి విలువ తెలుసుకొనే విధంగా ప్రజలు, రైతుల్లో చైతన్యం తీసుకురావాలని, భవిష్యత్తుతరాలు నీటి సమస్య ఎదుర్కోకోకుండా.. ఇప్పటి నుంచే కొత్త ప్రణాళిలు సిద్ధం చేయాలన్నారు. ప్రతి ఇంజినీరు బాధ్యతాయుతంగా పనిచేసి ఇటు ప్రభుత్వాన్ని.. అటు ప్రజలను మెప్పించి ఒప్పించాలన్నారు. జలవనరుల శాఖకు కొత్తగా ఎంపికైన ఏఈఈలకు కర్నూలులోని సీఈ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శిక్షణ, అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కొత్త ఏఈఈలను ఉద్దేశించి సీఈ మాట్లాడుతూ నేడు జలాల కోసం జగడాలు ఏర్పడే పరిస్థితి నెలకొందని, ఉన్ననీటిని జాగ్రత్తగా వినియోగించుకోవల్సి వస్తోందన్నారు. ఎంతో కీలకమైన శాఖలో బాధ్యతలు తీసుకుంటున్న ఏఈఈలు బాధ్యతాయుతంగా, క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని సీఈ కోరారు.

రైతులు, ప్రజలతో సత్సంబంధాలు మెరుగు పరుచుకొంటూ సాగునీటి ప్రాజెక్టులపై నిరంతరం అధ్యయనం చేయాల్సి ఉంటుందన్నారు. ఎస్ఈ చంద్రశేఖర్‌రావు పవర్ పాయింట్ ద్వారా కేసీ, దిగువ కాల్వలకు నీటి విడుదల, ఆయ కట్టు తదితర అంశాలను వివరించారు. వీటితోపాటు గురు రాఘవేంద్ర ప్రాజెక్టు (జీఆర్పీ) ఎత్తిపోతల గురించి విశ్లేషించారు.

ఎస్‌ఆర్‌బీసీ ఈఈ జి.విశ్వనాథం, డిప్యూటీ సీఈ శ్రీనివాసులు, హంద్రీనీవా డీఈఈ వరప్రసాద్‌రావులు ప్రసంగించారు. మధ్యాహ్నం భోజనానంతరం కొత్త ఏఈఈల బృందం సుంకేసుల పర్యటనకు బయలుదేరింది.

## స్వాతంత్ర్య సమరయోధుడు కన్నుమూత

నేమకల్లు: స్వాతంత్ర్య సమరయోధుడు ఎం.అక్బర్ అలీ (94) కన్నుమూశారు. గత కొద్ది రోజులుగా ఆయన అనారోగ్యంతో బాధ పడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. చిప్పగిరి మండలం నేమకల్లు గ్రామంలో 1922లో అక్బర్‌అలీ జన్మించారు. 1942 ఆగస్టు 9వ తేదీన ప్రారంభమైన క్విట్ ఇండియా ఉద్యమంలో గాంధీ పిలుపు మేరకు స్థానిక స్వాతంత్ర్య సమరయోధులు నారాయణరెడ్డి, నరసింహారెడ్డి, పాపాన్న చౌదరితో కలసి ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. బళ్లారి జైలులో ఆరు నెలలపాటు శిక్ష అనుభవించారు. స్వాతంత్ర్యం అనంతరం ప్రభు త్వం ఆయన సేవలను గుర్తించి సముచితంగా గౌరవించింది. పింఛనుతోపాటు భూమి కేటాయించింది. ఆయన మృతి విషయం తెలుసుకున్న డిప్యూటీ తహసీల్దారు వలీబాషా, ఎన్టీ మస్తాన్‌వలి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ లాంఛనాల ప్రకారం అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపీపీ పద్మావతి తదితరులు సైతం నివాళులర్పించారు.

## బీసీ కార్పొరేషన్‌కు సిబ్బందిని కేటాయింపు

నెల్లూరు : రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా బీసీ కార్పొరేషన్ కార్యాలయాల్లో సిబ్బంది కొరతతో పనులు జాప్యం జరుగుతుండటంతో ఈ కార్యాలయాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. బీసీసంక్షేమ శాఖ కార్యాలయాల్లో సిబ్బంది ఎక్కువ మంది ఉండటం, ఆన్‌లైన్ విధానం అమలులో వచ్చాక పనులు తగ్గిపోవడంతో ఎక్కువ మంది సిబ్బంది ఇక్కడ ఖాళీగా ఉంటున్నారు. దీంతో బీసీ సంక్షేమశాఖ కార్యాలయాల్లో అదనపు సిబ్బందిని బీసీ కార్పొరేషన్ శాఖకు కేటాయించింది. అందులో భాగంగా నెల్లూరు బీసీ కార్పొరేషన్ కార్యాలయానికి బీసీ సంక్షేమ శాఖ నుంచి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు , ఇద్దరు సహాయక బీసీ సంక్షేమ అధికారుల టి.వెంకటేశ్వర్లు, తేజోవతి, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు సౌజన్య, ఆదినారాయణలను ప్రభుత్వం నియామకం చేసింది.

## స్వచ్ఛ పెద్దాసుపత్రి దిశగా చర్యలు

కర్నూలు : సర్వజన వైద్యశాలలో నగరపాలక సంస్థ, ఐజీ ఇక్బాల్ సహకారంతో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించి ఆసుపత్రిలో పచ్చదనం ఏర్పాటుచేసి రోగులకు ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేవిధంగా చర్యలు చేపడుతామని ఆసుపత్రి పర్యవేక్షకులు డా.చంద్రశేఖర్ తెలిపారు. జరుగుతున్న పనులను ఐజీ ఇక్బాల్, నగరపాలక కమిషనర్ హరినాథ్‌రెడ్డితో కలిసి ఆసుపత్రి వెనుక భాగాన్ని పరిశీలించారు. ఆసుపత్రిని దత్తత తీసుకోవడానికి ఐజీ ముందుకు రాగా ఇటీవల కొన్ని పనులు చేపట్టారు. ఇంకా ఏమేం చేయాలన్న దానిపై వారితో ఐజీ చర్చించారు. ఈ సందర్భంగా డా.చంద్రశేఖర్ మాట్లాడుతూ ఐజీ సహకారంతో ఆసుపత్రిలో పచ్చదనం ఉండే విధంగా చర్యలు తీసుకొంటామన్నారు. ఇందుకు నగరపాలిక, ఏపీఎంఎస్‌ఐడీసీ విభాగం అధికారుల సహకారం తీసుకొని ప్రణాళికలు రూపొందిస్తామని చెప్పారు.

## లైసెన్సులు పునరుద్ధరించుకోకుంటే చర్యలు

### థియేటర్ యజమానులతో జేసీ నాగలక్ష్మి

ఒంగోలు : సినిమా థియేటరు యజమానులందరూ ఈ నెలాఖరులోగా బి.ఫారం లైసెన్సులను పునరుద్ధరించుకోవాలని జేసీ నాగలక్ష్మి ఆదేశించారు. స్థానిక సీపీవో సమావేశ మందిరంలో జేసీ మాట్లాడారు. అక్టోబరు 1 నుంచి లైసెన్సులు పునరుద్ధరిం చుకోని థియేటర్లలో సినిమాలు ప్రదర్శించడానికి వీలుదేని, లైసెన్సులు పునరుద్ధరించుకోకుండానే సినిమాలు ప్రదర్శిస్తే చట్ట ప్రకారం యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. థియేటర్లలో భద్రతా ప్రమా ణాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రతి థియేటర్‌కు అగ్నిమాపకశాఖ నుంచి నిరభ్యంతర పత్రం తప్పనిసరిగా తీసుకోవాలని, విద్యుత్తు, రహదారులు భవనాలు, పారిశుద్ధ్యం, ఫుడ్ ఇన్స్‌పెక్టర్ల నుంచి ధ్రువీకరణ పత్రాలు తీసుకోవాలని సూచించారు. థియేటర్లలో ఏదైనా ప్రమాదం జరిగితే, రెండు, మూడు నిమిషాల్లోనే ప్రజలందరూ బయటకు వెళ్లేలా ఏర్పాట్లు ఉండాలని స్పష్టం చేశారు. పానీయం, ఇతర తినుబండారాలను గరిష్ఠ చిల్లర ధరలకే అమ్మా లని, ప్రభుత్వం నిర్ణయించిన ధరలకంటే అధి కంగా అమ్మితే కేసులు నమోదు చేస్తా మన్నారు. థియేటరు లైసెన్సులను సైతం రద్దు చేస్తామని హెచ్చరించారు. డీఆర్వో ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ యజమానులందరూ తప్పనిసరిగా జీఎస్టీ కింద నమోదు చేసుకోవాలన్నారు. లైసె న్సులు తీసుకోవడంలో జాప్యం చేస్తే రోజుకు రూ.200 అపరాధ రుసుము విధిస్తామన్నారు. లైసెన్సుల పునరుద్ధరణకు రెండు రోజుల్లోపు యజమానులందరూ దరఖాస్తు చేసు కోవాలన్నారు.

పది రోజుల్లో ఆయా శాఖల నుంచి ధ్రువీకరణలు ఇప్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో జిల్లా అధికారులు, థియేటర్ల యజమానులు పాల్గొన్నారు.

## నేత్రదానంపై అవగాహన కల్పించాలి

నెల్లూరు : నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఉన్న ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో మంగళవారం నేత్రదానంపై అవగాహన సదస్సు జరిగింది. జిల్లా అంధత్వ నివారణాధికారి డాక్టర్ మంజులమ్మ పాల్గొని మాట్లాడుతూ పవిత్రమైన వృత్తిలో ఉన్న నర్సింగ్ విద్యార్థినులు నేత్రదానంపై ప్రజల్లో అవగాహన తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలను చైతన్య వంతులను చేస్తే ఎంతో మంది అంధులకు చూపును ప్రసాదించవచ్చన్నారు.

# దేశం కోసం పనిచేద్దాం

### జడ్పీ ఛైర్మన్ ఈదర హరిబాబు



ఒంగోలు : ఉపాధ్యాయులు జీతం కోసం కాకుండా, దేశం కోసం పని చేయాలని జడ్పీ ఛైర్మన్ ఈదర హరిబాబు అన్నారు. ఒంగోలులోని అంబేద్కర్ భవన్‌లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన హరిబాబు- జ్యోతి వెలిగించిన అనంతరం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. మూఢ నమ్మకాలను పారదోలడంతో పాటు కుల రహిత సమాజాన్ని నిర్మించడానికి ఉపాధ్యాయుల కేంద్రంగా మరో స్వాతంత్ర్య ఉద్యమం జరగాలన్నారు. గుడి కన్నా బడి మిన్న అంటారని, నిత్యం బడికి వెళ్లే ఉపాధ్యాయులు దేవుడితో సమానమన్నారు. అంతటి గురుతర స్థానాల్లో ఉన్న వారు ఎవరో ఒకరి మెప్పు కోసం కాకుండా సమాజంలో మార్పు కోసం కృషి చేయాలని ఉద్బోధించారు. కౌన్సెలింగ్ నిర్వహరణలో ప్రకాశం జిల్లా రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలిచిందని.. ఉపాధ్యాయుల క్రమశిక్షణే దీనికి కారణమన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ వి.బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఉపాధ్యాయులంతా సంఘటితంగా ముందుకు సాగడమే వారి ప్రధాన బలమన్నారు. రాబోయే రోజుల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఫంక్షన్ హాళ్లలో కాకుండా విద్యార్థుల మధ్యనే జరుపుకోవాలని సూచించారు. పోస్టింగ్‌లకు సంబంధించి ఉపాధ్యా యులకు కౌన్సెలింగ్ ఉన్నట్లే.. డీఈవోలకు కూడా ప్రతిభ ఆధారంగా పోస్టింగ్ ఇచ్చే విధానాన్ని అమలు చేయాలని అభిప్రాయపడ్డారు. జిల్లాలో బడి మానేసే విద్యార్థుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోందని, ఈ స్థితి నుంచి ప్రభుత్వ పాఠశాలలను గట్టెక్కించాల్సిన బాధ్యత ఉపాధ్యాయుల మీదే ఉందన్నారు. డీఈవో విజయభాస్కర్ మాట్లాడుతూ మంచి మనిషికాని వ్యక్తి మంచి ఉపాధ్యాయుడు కాలేడని, అందుకే ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థులతో మంచిగా ప్రవర్తిం చాలన్నారు. పిల్లలకు నిత్యం ఆదేశాలు జారీ చేయకుండా.. వారితో మంచి విషయాలను ముచ్చటించాలన్నారు. సహనం లేనిదే ఉపాధ్యాయ వృత్తికి పనికిరారని, గడియారం చూసుకోకుండా విధులు నిర్వర్తించిన ఉద్యోగుల జీవితాలు ధన్యమవుతాయన్నారు. విద్యార్థులకు జీవితంలో ఉద్యోగం సాధించడం ఎలా అన్న విషయం కాకుండా, ఉద్యోగానికి సంబంధించిన విధులను ఎలా నిర్వర్తించాలో బోధించాలన్నారు.

జడ్పీ సీఈవో సాయికుమారి మాట్లాడుతూ జాతిని నిర్మించేది ఉపాధ్యాయులేనని, విలువలతో కూడిన విద్యను అందించాల్సిన బాధ్యత ప్రతి ఉపాధ్యాయుడిపై ఉందన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 89 మందిని శాలువ, జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో దయానంద్, సాల్మన్, కిషోర్ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

# విజయభాను
## సంపాదకీయం

### మోదీ తీరు ఆశ్చర్యం.. ఆందోళన

స్వేచ్ఛాయుత మార్కెట్‌కోసం తీసుకున్న చర్యలను గురించి మోదీ చెప్పిన తీరు ఒకింత ఆశ్చర్యం, ఆందోళన కలిగించేవిగా ఉన్నది. స్వేచ్ఛాయుత మార్కెట్‌ను అందరికీ అందుబాటులో ఉంచటం కోసమే 130 కోట్ల ప్రజలున్న భారత మార్కెట్‌ను జీఎస్టీతో అఖండం చేశానని చెప్పటం శోచనీయం.ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అని భారత్‌ను గురించి ఐఎంఎఫ్ పొగిడిందని మోదీ మురిసిపోవటం గురించి ఆలోచించాల్సిందే. ఏదేమైనా ప్రపంచ రాజకీయ, ఆర్థిక విషయాలపై గట్టి ప్రభావం వేయగల బ్రిక్స్ దేశాల ఐక్యత ఆవశ్యకతను నేతలు గుర్తించటం హర్షణీయం. చైనాలో జరిగిన బ్రిక్స్ దేశాల తొమ్మిదో సమావేశంలో భారత్ భారీ దౌత్య విజయం సాధించింది. బ్రిక్స్ కూటమి సదస్సు ప్రకటనలో తొలిసారి పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రవాద సంస్థలు జైషే మహ్మద్, లష్కరే తాయిబా పేర్లు ప్రస్తావించారు. నేరుగా పాకిస్థాన్ పేరెత్తకున్నా, ఆ దేశ ఉగ్రసంస్థల్ని బ్రిక్స్ ఉమ్మడి ప్రకటనలో పేర్కొనడం భారత్ సాధించిన విజయం. గతంలో ఉరీ ఘటన తర్వాత భారత్‌లోని గోవాలో జరిగిన బ్రిక్స్ దేశాల సమావేశంలో టెర్రరిజం గురించి ప్రస్తావన తేవడానికే చైనా తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది. ప్రాంతీయ సమస్యలతో బ్రిక్స్ దేశాల వ్యాపార, దౌత్య సంబంధాల మధ్య విఘాతం కలిగించరాదని గోవా సమ్మిట్ సందర్భంగా చైనా వాదించింది. అయినా ప్రధాని మోదీ పట్టువదలని విక్రమార్కుడిలా టెర్రరిజాన్ని ప్రోత్సహిస్తున్న దేశాలపై బ్రిక్స్ దేశాలు సుస్పష్టమైన విధానంతో ముందుకుపోవాలని పట్టుబట్టారు. దీని ప్రతిఫలంగానే నేడు బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికాలతో కూడిన ఐదు దేశాల బ్రిక్స్ దేశాల కూటమి చేసిన షియామెన్ ప్రకటన చేసింది. 43 పేజీల షియామెన్ ప్రకటనలో ఉగ్రవాద చర్యలకు పాల్పడిన వారిని, నిర్వహించే వారిని, మద్దతు తెలిపే వారిని జవాబుదారీగా చేయాలని ఆ ప్రకటన స్పష్టం చేసింది. ఇది భారత్‌కు పెద్ద ఊరడింపుగానే భావించాలి. అలాగే ఉగ్ర కార్యకలాపాలపై బ్రిక్స్ దేశాలన్నీ పరస్పరం సమాచారం పంచుకోవాలనీ, ఉగ్రమూకలపై సమిష్టిపోరు చేయాలని నిర్ణయించాయి. దీన్ని శాంతి, సమగ్రతలకు ఆవశ్యకమైన చర్యగా భావించవచ్చు. చైనా-భారత్‌ల మధ్య ఏర్పడిన డోక్లామ్ ఉద్రిక్తతల నేపథ్యంలో ఒకానొక సందర్భంలో బ్రిక్స్ సదస్సులో ప్రధాని మోదీ పాల్గొనటంపైనే అనుమానాలు తలెత్తాయి. డోక్లామ్ ప్రాం తంలో ఇరుదేశాల సైనిక మొహరింపులతో ఏర్పడిన ఉద్రిక్త పరిస్థితుల్లో చైనా గడ్డపై జరిగే బ్రిక్స్ సమావేశాల్లో పాల్గొనాలా, వద్దా అనేది ప్రజల మనోభావాల సమస్యగా మారింది. అంతేగాకుండా భారత్-పాక్ సరిహద్దు వెంట పాక్ ప్రేరేపి త చొరబాట్లపై భారత్ చేసిన ఆందోళనను అన్ని వేదికలపై చైనా తేలికగా కొట్టివేసింది. చాలా సందర్భాల్లో పాక్‌ను వెనకేసుకొచ్చిన సందర్భాలూ ఉన్నాయి. జైషే మహ్మద్ ఉగ్రసంస్థ అధినేత మసూద్ అజర్‌ను ఐక్యరా జ్యసమితి ద్వారా ప్రపం చ ఉగ్రవాదిగా ప్రకటింపజేయాలన్న భారత్ ప్రయత్నాలను చైనా అడ్డుకున్నది. కశ్మీర్ సమస్య, కశ్మీర్ లోయలో మానవ హక్కుల ఉల్లంఘనల అంశాన్ని ముందుకుతెచ్చి టెర్రరిస్టు కార్యకలాపాలపై అంతర్జాతీయంగా ఒత్తిడి తేవాలన్న భారత్ ప్రయత్నాల కు చైనా ఎక్కడికక్కడ అడ్డుకున్నది. అయితే జియామెన్ సమ్మిట్‌లో చైనా తన వైఖరిని మార్చుకోవ డం శు భసూచకం. ఈ సందర్భంగానే అఫ్ఘానిస్థాన్ లో హింసకు వెంటనే చరమగీతం పలుకాల్సిన అవసరమున్నదని బ్రిక్స్ ప్రకటన స్పష్టంగా పేర్కొన్నది. అలాగే తాలిబన్లు, ఐఎస్ఐఎస్, హఖా నీ నెట్‌వర్క్, లష్కరే తాయిబా, జైషే మహ్మద్, తెహ్రీ కే ఇ తాలిబన్ పాకిస్థాన్, హిజ్బుల్ తెహ్రీర్‌ల కారణంగా పెచ్చరిల్లుతున్న హింస, భద్రత పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేసింది. దీంతో ఎంతోకాలంగా భారత్ చేస్తున్న ఒంటరి పోరాటానికి మద్దతు లభించింది. నిజానికి 2006లో బ్రిక్స్ కూటమి ప్రారంభమైన కాలం నుంచి నేటికి బ్రిక్స్ సాధించి న పరిణతిగానే భావించాలి. ప్రపంచాన్ని అతలాకుతలం చేస్తున్న ఉగ్రభూతం విషయంలో బ్రిక్స్ దేశాల కూటమి సాధించిన ప్రగతిగానే చెప్పుకోవాలి. బలమైన భాగస్వామ్యం,ఉజ్వలమైన భవిష్యత్తు నినాదంతో చైనా జియామెన్‌లో జరిగిన బ్రిక్స్ సదస్సు ఆశించిన లక్ష్యం దిశగా అడుగు వేసింది. బ్రిక్స్ దేశాల కూటమి పరస్పర ఆర్థిక, వాణిజ్య సహకారంతో చేయి చేయి కలిపితే రాబోయే కాలంలో ఎదురయ్యే అన్నిరకాల సవాళ్లను అధిగమించవచ్చు. భారత్, దక్షిణాఫ్రికా లాంటి దేశాల్లో ప్రజలకు కావాల్సిన మౌలికవసరుల కల్పనకు సభ్యదేశాల సహకారం ఎంతైనా తోడ్పడు తుంది. ప్రపంచ జనాభాలో బ్రిక్స్ దేశాల జనాభానే 42 శాతంగా ఉంటుంది. ప్రపంచ జీడీపీలో 23శాతం, ప్రపంచ వాణిజ్యంలో 17 శాతం కలిగి ఉన్న ఈ దేశాలు ఒకే మాట, ఒకే బాటగా నడిస్తే అగ్రరాజ్యం అమెరికా ఆటలకు ముకుతాడు వేయవచ్చు. ఇదే సందర్భంగా స్వేచ్ఛాయుత మార్కెట్‌కోసం తీసుకున్న చర్యలను గురించి మోదీ చెప్పిన తీరు ఒకింత ఆశ్చర్యం, ఆందోళన కలిగించేవిగా ఉన్నది.

## ట్రంప్‌ది చాలా క్రూరమైన నిర్ణయం: ఒబామా



వాషింగ్టన్ : చిన్నప్పుడే తల్లిదండ్రులతో పాటు అమెరికా వచ్చి ఉద్యోగాలు చేస్తున్న యువత(డ్రీమర్స్)ను అక్రమ వలసదారులుగా గుర్తించడాన్ని మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా తీవ్రంగా ఖండించారు. సుమారు 8 లక్షల మంది డ్రీమర్స్ (డిఫర్డ్ యాక్షన్ ఫర్ చైల్డ్‌హుడ్ అరైవల్స్‌డీఏసీఏ) వర్క్ పర్మిట్లను అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రద్దు చేయడాన్ని క్రూరమైన నిర్ణయంగా ఒబామా అభివర్ణించారు. డ్రీమర్స్ ఆశలు గల్లంతు చేస్తూ ఫైలుపై ట్రంప్ సంతకం చేయగా, అదేరోజు ట్రంప్ చర్యను ఒబామా తప్పుపట్టారు. డ్రీమర్స్ వర్క్ పర్మిట్లు రద్దు చేయడాన్ని క్రూరమైర నిర్ణయంతో పాటు ట్రంప్ సొంతంగా తన ఓటమిని ఒప్పుకున్నారని అభిప్రాయపడ్డారు. వలసదారుల వల్ల అమెరికాకు పొంచి ఉన్న ప్రమాదమేంలేదని, వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరంలేదని తన ఫేస్ బుక్ ఖాతాలో ఒబామా పేర్కొన్నారు. పేరెంట్స్ అమెరికాకు రావడమే డ్రీమర్స్ చేసిన తప్పిదం కాదని.. దేశ ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చే యువతపై ఆంక్షలు విధించడం మంచిది కాదని ఆయన హితవు పలికారు. ఎన్నికల సమయంలో చెప్పినట్లుగా డీఏసీఏను రద్దు చేస్తూ ట్రంప్ నిర్ణయం తీసుకోగా.. ఆయన నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ డ్రీమర్స్ (డీఏసీఏ) మద్దతుదారులు అధ్యక్ష భవనం వైట్ హౌస్ ఎదుట ఆందోళన చేపట్టారు. తమపై తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. డీఏసీఏ రద్దును ప్రపంచంలోనే అత్యుత్తమ సంస్థల వ్యవస్థాపకులు, సీఈవోలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఫేస్‌బుక్ సీఈవో జుకర్‌బర్గ్, యాపిల్ సీఈఓ టిమ్ కుక్, మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల, గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్, అమెజాన్ సీఈవో జెఫ్ బెజోస్ సహా మరికొందరు బిజినెస్ దిగ్గజాలు వలసదారులకు చట్టపరంగా రక్షణ కొనసాగించాలని, డీఏసీఏను రద్దు చేస్తే అమెరికా ఆర్థిక వ్యవస్థకు ప్రమాదకరమంటూ ఇప్పటికే ట్రంప్‌కు లేఖ రాశారు.

అమెరికాలో నివసించేందుకు, పనిచేసేందుకు అధికారిక ధ్రువీకరణ పత్రాలు లేకున్నా డ్రీమర్లు దేశ ఆర్థికవ్యవస్థ బలోపేతానికి కృషి చేస్తున్నారని వారిపై దయతో అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఒబామా 2012లో చట్టపరంగా వెసులుబాటు కల్పించారు. బాల్యంలో వచ్చినవారిపై చర్యల వాయిదా (డిఫర్డ్ యాక్షన్ ఫర్ చైల్డ్‌హుడ్ అరైవల్స్‌డీఏసీఏ) సహాయ కార్యక్రమాన్ని 2012 జూన్ 15న ఆయన ప్రకటించారు. డ్రీమర్స్ రెండేళ్లకొసారి తమ వర్క్ పర్మిట్లను రెన్యూవల్ చేసుకుంటే చాలు ఏ సమస్య లేకుండా అమెరికాలో జాబ్ చేసుకోవచ్చు.

## వీటితో స్వైన్‌ఫ్లూకు దూరంగా ఉండండి..

హైదరాబాద్: దేశంలో స్వైన్‌ఫ్లూ చాపకింద నీరులా విస్తరిస్తోంది. కేంద్ర ఆరోగ్యశాఖ లెక్కల ప్రకారం ఈ ఏడాది దేశవ్యాప్తంగా 25,864 స్వైన్‌ఫ్లూ కేసులు నమోదయ్యాయి. ఇది గతేడాది నమోదైన కేసులకన్నా 14 రెట్లు ఎక్కువ. ఇక 2016లో 1,786 కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం ఈ విషయం ఆందోళన కలిగిస్తోంది. ఇక ఈ వ్యాధితో మరణించే వారి సంఖ్య నాలుగు రెట్లు పెరిగింది. స్వైన్‌ఫ్లూ శ్వాసకోస వ్యాధి కావడంతో త్వరగా విస్తరిస్తోంది. వ్యాధిని గుర్తించడంలో నిర్లక్ష్యం వహించడం, సకాలంలో వైద్యం అందకపోవడంతో ఈ వ్యాధి మరణాల సంఖ్య పెరుగుతోంది.

వ్యాధి నిరోధక శక్తి పెంచుకోవడంతోనే స్వైన్‌ఫ్లూ కు దూరంగా ఉండవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. సహజంగా లభించే ఆహార పదార్థాలతో వ్యాధినిరోధక శక్తి పెంచుకోవచ్చు. ఇది చల్లని వాతవారణంలో త్వరగా వ్యాప్తి చెందుతోంది కాబట్టి ఈ మన్‌సూన్ సీజన్‌లో జాగ్రత్తగా ఉండాలి.

ఈ కింది వాటితో వ్యాధినిరోధక శక్తి పెంచుకోవచ్చు..

టవేడి నీరు, నిమ్మ రసం, తేనేల మిశ్రమాన్ని ఉదయాన్నే పడిగడుపున తీసుకుంటే బరువు తగ్గడంతో పాటు, వ్యాధి నిరోధక శక్తి పెంపొందించుకోవచ్చు.

హెర్బల్ టీలతో కూడా వ్యాధినిరోధక శక్తి పెంచుకోవచ్చు. దీంతో ఇన్‌ఫెక్షన్ల నుంచి దూరంగా ఉండవచ్చు. తులసి, అల్లం, నిమ్మ, బ్రాహ్మి టీలతో ఈ వ్యాదికి దూరంగా ఉండవచ్చు.

ఉసిరి జ్యూస్‌లో తేనేను కలిపి తాగడం వల్ల కూడా వ్యాధి నిరోధక శక్తి పెంచుకోవచ్చు. ఇందు యాంటీ ఆక్సిడెంట్స్,




మైక్రో న్యూట్రిన్‌లు పుష్కలంగా ఉంటాయి.

పసుపు మానవ శరీరానికి మంచి ఔషదంలా పనిచేస్తోంది. యాంటి బ్యాక్టీరియా, యాంటీ ఫంగల్ గా పనిచేస్తూ వ్యాధినిరోధక శక్తిని పెంపొందిస్తుంది. ఇది మనం వంటలలో రోజు వాడేదే.

నల్లమిరియాలు శరీరంలో వేడిమిని తగ్గించడమే కాకుండా వ్యాధినిరోధక శక్తి పెంపొందిస్తాయి. మిరియాలను కూడా మన ఆహార పదార్థాల్లో ఉపయోగిస్తాం.

దాల్చిన చెక్కతో జలుబు, దగ్గు, గొంతునొప్పి, తలనొప్పిలను తగ్గించడమే కాకుండా ఎలాంటి వైరస్‌లు ధరిచేరకుండా చేస్తోంది. దాల్చిన చెక్క పౌడర్‌ను తేనేలో కలుపుకొని తీసుకుంటే మంచి ఫలితాలుంటాయి.

## మాటలు రావడం లేదు : సీఎం

బెంగళూరు: ప్రముఖ పాత్రికేయురాలు, సామాజిక వేత్త గౌరీ లంకేశ్ హత్య కేసులో నిందితులను త్వరలో పట్టుకుంటామని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రకటించారు. గౌరి కుటుంబ సభ్యులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీయిచ్చారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈ కేసులో విచారణ కోసం ఐజీ నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. హంతకులు హెల్మెట్ ధరించి వచ్చి ఈ కిరాతకానికి పాల్పడ్డారని తెలిపారు. సీసీ టీవీ ఫుటేజీని పోలీసులు పరిశీలిస్తున్నారని చెప్పారు. గౌరీ లంకేశ్ ఇటీవలే తనను కలిశారని, ఎటువంటి ప్రాణహాని ఉందని చెప్పలేదన్నారు. కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించే విషయం డీజీపీకి వదిలిపెట్టామన్నారు. కేంద్ర హోంమంత్రితో మాట్లాడిన తర్వాత దీనిపై నిర్ణయం తీసుకుంటారని చెప్పారు.

కల్బుర్గీ, దభోల్కర్‌లను హత్యలకు... గౌరి హత్య కేసుకు సంబంధం ఉందో, లేదో ఇప్పుడే చెప్పలేమన్నారు. రాష్ట్రంలో అభ్యుదయవాదులందరికీ రక్షణ కల్పించాలని పోలీసులను ఆదేశించినట్టు తెలిపారు. గౌరీ లంకేశ్ హత్య తనకు దిగ్భ్రాంతి కలిగించిందని, ఈ కిరాతకాన్ని ఖండించడానికి మాటలు రావడం లేదని సిద్ధరామయ్య ట్విటర్‌లో పేర్కొన్నారు. ఇది ప్రజాస్వామ్యంపై జరిగిన హత్య.

గౌరి మరణంతో కర్ణాటక బలమైన అభ్యుదయ గళాన్ని కోల్పోయింది. నేను స్నేహితురాలిని పోగొట్టుకున్నానని ట్వీట్ చేశారు.

## కవి సమయం

### 'మనిషి మార్గం'

అలమట = బాధ; దుఃఖం

ప: ఎంచకురా... పంచ మనిషిని
పెంచుమురా... ప్రేమమాటను
పస్తులతో... అలమటగుంటే...?
దెప్పులతో... సులకనేలరా....? "ఎంచ"
చ: పస్తులతో... వున్నవారికి
పాయసం కావాలా?
సరిసాలని దప్పిక దొరికితే...?
సరిపుచ్చు కోవాలా...;
చ: కుక్క మంచము - గూనికి కాదు?
లేని దానికి అది మేలు
నీ శ్రమ యేదో అదియేగా...
వయ్యసు మీరిన కుదరదుగా...
చ: దప్పుడు పులుసు జిమ్మకు మేలు
పట్టును కడుపుకి దోసెడు వరకే...
దొప్పడు తాగితే సరికాదు
జారులు జోరుతో యిబ్బందే...
చ: మూలుగు మనిషికి ముఖ్రాట
దిగదుడుచుట మనిషికి కాదని
వనమాలిక సాధనతో
నయపరచు వ్యాధిని;
వైద్యుని సలహాతో
మందులు వాడుల మంచిదని

...కవితా రచన
మజ్జి శ్యామసుందరరావు
సెల్ నెం: 9290839512


## పంచాంగం

మాసం : భాద్రపద ; తిథి : బహుళ పాడ్యమి ఉ.11.47; పూర్వాభాద్ర మ.1.58; రా.వ.11.32 ల 1.08

గురువారం 07-09-2017

**మేషం** : కొంతమంది సూటిపోటి మాటలు పడటం వల్ల మానసిక ఆందోళనకు గురవుతారు. పాత వస్తువులను కొని ఇబ్బందులను ఎదుర్కొంటారు. ట్రాన్స్‌పోర్టు, ట్రావెలింగ్ రంగాల వారికి కలిసిరాగలదు. దూర ప్రాంతాలకే చేయు ప్రయత్నాలు ఫలిస్తాయి. **వృషభం** : ధనం ఏమాత్రం నిలబెట్టలేక పోయినా ఆర్థిక ఇబ్బంది అంటూ ఏదీ ఉండదు. సాంస్కృతిక, సేవా కార్యక్రమాల్లో చురుకుగా వ్యవహరిస్తారు. అకాల భోజనం, ప్రశాంతత లోపం వల్ల ఆరోగ్యం మందగిస్తుంది. కాంట్రాక్టర్లకు, బిల్డర్లకు పనివారలతో సమస్యలు తలెత్తుతాయి. రిజిస్ట్రేషన్లకు ఇది అనువైన సమయం కాదు. **మిథునం** : మీరు చేసే పనులకు బంధువుల నుంచి విమర్శలు, వ్యతిరేకత ఎదుర్కొనక తప్పదు. ముఖ్యులకు బహుమతులను అందజేస్తారు. రాబోయే కాలంలో ఖర్చులు, అవసరాలు మరింత పెరిగేందుకు ఆస్కారం ఉంది. నిరుద్యో గులకు ఉపాధి పథకాలు సంతృప్తికరంగా సాగుతాయి. వాగ్వివాదాలకు దూరంగా ఉండటం మచిది. **కర్కాటకం** : ప్రముఖులను కలుసుకుని బహుమతులను అందజేస్తారు. మధ్యవర్తిత్వం వహించుట వల్ల ఇబ్బందులను ఎదుర్కొం టారు. మీలోని శక్తిసామర్థ్యాలు ద్విగుణీకృతమయ్యే అవకాశం దక్కుతుంది. ఉపాధ్యాయులకు మంచి గుర్తింపు లభిస్తుంది. వృత్తి, ఉద్యోగాలలో వారికి ఆదా యం సంతృప్తికరంగా ఉంటుంది. ధన లబ్ధి పొందుతారు. **సింహం** : ప్రైవేటు సంస్థలలోని వారికి ప్రతి విషయంలోనూ ఓర్పు, లౌక్యం అవసరం. స్త్రీలకు పనివారితో చికాకులు ఎదురవుతాయి. ఉద్యోగస్తుల హోదా పెరగడంతో పాటు... బరువు బాధ్యతలు అధికమవుతాయి. **కన్య** :ప్రభుత్వ కార్యక్రమాలలోని పనులు అనుకూలిస్తాయి. స్త్రీలకు షాపింగ్, వ్యవహారాలలో మెళకువ అవసరం. నిరు ద్యోగులకు బోగస్ ప్రకటనలు, కొత్త వ్యక్తుల పట్ల అప్రమత్త అవసరం. గృహంలో చికాకులు తొలగి ప్రశాంతత నెలకొంటుంది. మీ సంతానం కోసం ధనం బాగా వ్యవం చేయవలసి వస్తుంది. **తుల** : ఇప్పటివరకు విరోధులుగా ఉన్న వ్యక్తలను సుముఖం చేసుకోగలుగుతారు. ప్రేమికులు పెద్దల ఆగ్రహావేశాలకు గురికావలసి వస్తుంది. వాహన చోదకులకు ఆటంకాలు తప్పవు. బంధు మిత్రులతో మనస్పర్థలు తలెత్తు తాయి. చేతి వృత్తి వ్యాపారులకు లాభదాయకం. రాజకీయ రంగాల వారికి గుర్తింపు, రాణింపు లభిస్తుంది. **వృశ్చికం** : ఉద్యోగస్తులు కొత్త బాధ్యతలు స్వీకరిస్తారు. పెద్దల ఆరోగ్య, ఆహార విషయాల్లో మెళకువ అవసరం. ఉత్తర ప్రత్యు త్తరాలు సంతృప్తినిస్తాయి. మిత్రుల కారణంగా మీ కార్యక్రమాలు మార్చుకోవలసి వస్తుంది. బంధువుల రాక వల్ల ఖర్చులు అధికమవుతాయి. సిమెంట్, ఇసుక, ఐరన్, కలప వ్యాపారులకు పురోభివృద్ధి. **ధనుస్సు** :వ్యాపారాల్లో నూతన భాగ స్వాములను చేర్చుకునే విషయంలో బాగా ఆలోచించి నిర్ణయం తీసుకోవలసి వస్తుంది. పత్రిక, ప్రైవేటు సంస్థలలోని వారికి యాజమాన్యం తీరు నిరుత్సాహం కలిగిస్తుంది. విద్యార్థుల ఆలోచనలు పక్కదారి పట్టే ఆస్కారం ఉంది. దైవ కార్య క్రమాలకు కుటుంబీకులతో ఉల్లాసంగా గడుపుతారు. **మకరం** : ఉద్యోగస్తుల శక్తి సామర్థ్యాలను అధికారులు గుర్తిస్తారు. కాంట్రాక్టర్లకు ఇంజనీరింగ్ అధికారుల నుంచి అభ్యంతరరాలెదుర్కోవలసి వస్తుంది. **కుంభం** :చిన్నాటి మిత్రులను, ప్రియమైన వ్యక్తులను కలుసుకుంటారు. మీ జీవిత భాగస్వామి సలహా తీసుకోవడం శ్రేయస్కరం. **మీనం** : వ్యాపారంలో పెరిగిన పోటీని తట్టుకోవడానికి అహర్నిశలు శ్రమిస్తారు. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. రుణ బాధలు తొలగుతాయి.

# సత్య సాయి 'జీవిత సత్యాలు'



రాగద్వేషాలే రాహుకేతువులు.

శీలం లేని మనిషి చిల్లుల కుండ వంటివారు.

సేవ ప్రేమ యొక్క మనోహర పుష్పం.

హరికి దాసులు కండి.. సిరికి కాదు..

జీవితం జీతం కోసం కాదు.. జీవించడానికే..

శాంతి, ప్రేమలతో నీలోని రక్తనాళములను నింపుము.

గురువులు చిత్తాపహరులు కావాలి. విత్తాపహరులు కారాదు.

ఆపేక్ష బంధ కారణం. ఉపేక్ష మోక్ష కారణం.

మానసిక దౌర్బల్యమున్న వారు అన్నింటియందు అపజయమును పొందుతారు.

నీవు మనస్సును దైవము వైపు మరల్చినచో బంధ విమోచన కలుగుతుంది. ప్రకృతి వైపు మరల్చితే బంధం ఏర్పడుతుంది.

కర్తవ్య కర్మలను సరిగా నిర్వర్తించుటే తపస్సు.

మానవత్వంలో దివ్యతత్వమును ప్రకటింప చేయుటయే విద్య యొక్క ప్రధాన లక్ష్యం.

కోరికలు తరిగితే ఇచ్ఛాశక్తి పెరుగుతుంది.

నీలోని దుర్భావములను దూరము చేసుకోకుండా ఎన్ని సాధనలు చేసినప్పటికీ ప్రయోజనము లేదు.

పారాయణ కంటే ఆచరణ ముఖ్యం.

సేవలో పాల్గొనడం ద్వారా అహంకారము నిర్మూలించబడుతుంది.

## సంకీర్తన

:: ***ఆరోగ్యం గురించి*** ::

దేహము, ఆత్మయొక్క నివాస స్థానము. కాబట్టి ఆ దేవాలయమును తగిన భద్రత, పోషణలతో చూచుకొనవలెను. "దేహో దేవాలయః ప్రోక్తః జీవో దేవ సన్నాతనః"

మంచి పనులు చేయటానికీ, మోక్షాన్ని పొందటానికీ ఈ దేహం ఉపయోగిస్తుంది. ("దేహ శక్తి లేని దీనునుకి ఏ విధంగా దైవ చింతన అబ్బుతుంది?" - వేమన).

ఆకలి అనే రోగమునకు అన్నమే ఔషధము.

దేహాన్ని తుచ్ఛమైనదిగా భావించకండి. దానిని అతిగా లాలించడమూ తప్పే.

'రాగము, ద్వేషము' అను విషయములు నీలో ఉన్నంత కాలమూ నీవు ఆరోగ్యవంతుడవు కాజాలవు.

నీకు కోపము, ద్వేషము కలిగినప్పుడు శరీరములో చిత్రమైన మార్పులు వస్తాయి. రెండు బ్యాటరీల మీద మూడు నెలలు ఒక బల్బును వెలిగగించిన ఎంత శక్తి అవుతుందో, ఒక నిముషం కోపము వచ్చినా అంత వృథా అవుతుంది.

సర్వ రోగాలకూ మనస్సే పుట్టినిల్లు నెమ్మదిగా ప్రశాంతంగా ఉండాలంటే ధ్యానం, జపం, భజన చేయాలి.

అతిగా తింటే తమో గుణం, తక్కువగా తింటే నీరసం, నరముల బలహీనత, జ్ఞాపక శక్తి తగ్గుట సంభవించును.

శాఖాహారం మంచిది. ఇది ఆరోగ్యానికి, ఆధ్యాత్మిక సాధనకు తోడ్పడుతుంది.

జీవించుటకై భుజింపుము. భుజించుటకై జీవించకు.

దైవ భావముతో శయ్య నుండి మేల్కొనుము.

సదాచారము, సజ్జనసాంగత్యము లేనిదే ఆరోగ్యము సిద్ధించిననూ నిలువదు.

ఈనాటి మానవుల రోగాలకు మానసిక విశ్రాంతి లేకపోవటమే మూలకారణం.


ఆహారమనగా మనము నోటితో స్వీకరించునది మాత్రమే గాక ఇతర ఇంద్రియములతో అనగా కన్ను, ముక్కు, చెవి.. వీటితో స్వీకరించునవి కూడా విశిష్టముగా ఉండవలెను. అదే సాత్వికాహారమని బాబా వారు చెప్పిరి.

ఆరోగ్యానికి శరీర శుద్ధి అవసరము. ఆనందానికి ఆత్మశుద్ధి ప్రధానము.

:: ***దైవ సాన్నిధ్యానికి పది సూత్రాలు*** ::

"జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపీ గరీయసి" జన్మభూమి కన్న తల్లి వంటిది. ప్రతీ మానవుడు దేశాభిమానము కలిగి వుండాలి.

ఏ మతాన్ని ద్వేషించక సర్వ మతాలను గౌరవించాలి. ***సశేషం..***



బాబ్జి

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
విజయభాను క్లాసిఫైడ్స్
Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 2564353, 2569004

# రజకుల ఆర్థికాభివృద్ధికి సంక్షేమ కార్యక్రమాలు

తిరుపతి : తితిదేలో, ప్రభుత్వ ఆసుపత్రుల్లో దుస్తులు ఉతికే పనిని రజకులకే కేటాయించాలన్న అంశంపై ప్రభుత్వానికి నివేదిక అందించనున్నట్లు ఏపీ వాషర్‌మెన్ ఫెడరేషన్ ఛైర్మన్ రాజమండ్రి నారాయణ, డైరెక్టర్ షణ్ముగం తెలిపారు. తమ రెండురోజుల పర్యటనలో భాగంగా ఎంబీసీ కార్పొరేషన్ ఎండీ బి.నాగేశ్వర్‌రావుతో కలిసి ఏపీ వాషర్‌మెన్ ఫెడరేషన్ పాలకమండలి సభ్యులు తిరుపతిలో సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా స్విమ్స్, బర్డ్ ఆసుపత్రులతో పాటు శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, నగరంలోని బొమ్మగుంట, గాంధీపురం, మంగళం దోబీఘాట్లను పరిశీలించారు. ప్రభుత్వ సంస్థలలో ఉన్న వాషింగ్ ప్లాంట్లు, దుస్తులు ఉతికేందుకు వినియోగిస్తున్న విధానాలు, పనిచేస్తున్న దోబీల స్థితిగతులను పరిశీలించారు. స్విమ్స్ సంచాలకులు రవికుమార్‌తో గంటపాటు చర్చలు జరిపారు. స్విమ్స్‌లో ప్రస్తుతం టెండర్ల ద్వారా ప్రైవేటు వ్యక్తులు బట్టలు ఉతికే పనిని చేస్తున్నారని అయితే ప్లాంట్‌లో పనిచేసే సిబ్బంది అంతా దోబీలేనని స్విమ్స్ సంచాలకులు కమిటీకి వివరించారు. త్వరలో టెండర్లు ముగియనున్నాయని, రజకులే నిర్వహించుకునేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని కమిటీకి వివరించారు.

అనంతరం కబ్జాకు గురైన గాంధీపురం దోబీఘాట్‌ను, పూర్తి స్థాయిలో నీటి వసతి లేకపోవడంతో ఇబ్బంది పడుతున్న పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ ఛైర్మన్ రాజమండ్రి నారాయణ, డైరెక్టర్ షణ్ముగం మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న 50 లక్షలమంది దోబీలు ఆర్థిక పరిపుష్టి సాధించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి ప్రభుత్వానికి నివేదికను అందించనున్నట్లు తెలిపారు. పర్యటనలో ఫెడరేషన్ డైరెక్టర్లు బాల వెంకటరమణ, సింహాచలం, సంచార జాతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు రవి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, రజక సంఘం నాయకులు దాము, రాజా, గంధం బాబు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రపుష్ప.. పవిత్రం



శ్రీకాళహస్తి : పంచభూత లింగాల్లో వాయులింగ క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో పవిత్రోత్సవాల్లో భాగంగా.. మంత్రపుష్ప సహిత పవిత్ర సమర్పణ పూజాది కార్యక్రమాలు ఆగమోక్తంగా జరిగాయి. ముక్కంటి ఆలయంలోని యాగశాల వద్ద విశేష పూజలు, ప్రత్యేక హోమాలు జరిపారు. అనంతరం అక్కడ నుంచి పవిత్రమాలలు, పూజాద్రి ద్రవ్యాలను ఆలయంలో వూరేగింపుగా తీసుకువచ్చారు. అనంతరం శ్రీవినాయకస్వామి, శ్రీవల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, శ్రీజ్ఞానప్రసూనాంబిక సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామితో పాటు సూర్యభగవానునికి ప్రతిమలకు పవిత్రమాలలు సమర్పించి పూజలు జరిపారు. అనువంశిక ప్రధాన అర్చకులు సదాశివగురుకుల్, స్వామినాథన్ గురుకుల్ నేతృత్వంలో.. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య దేవతామూర్తులకు విశేష పూజా ద్రవ్యాలను సమర్పించారు. ధూప, దీప, నివేదనాది కైంకర్యాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో భ్రమరాంబ, ధర్మకర్తల మండలి సభ్యులు పి.ఎం.చంద్ర, ప్రమీలమ్మ, వెంకటరామానాయుడు, సంబంధం గురుకుల్, ఏఈవో మోహన్ పాల్గొన్నారు.

# పర్యాటక దినోత్సవం పోటీలు 8న

కడప : ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా నిర్వహించే పోటీలు మొదటి దశ సెప్టెంబరు 8వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని జిల్లా పోటీల కో-ఆర్డినేటరు డాక్టర్ కే.మృత్యుంజయరావు ఓ ప్రకటనలో తెలిపారు. పోస్టర్ పెయింటింగ్‌లో పాల్గొనే వారికి డ్రాయింగ్ షీట్‌ను మాత్రమే నిర్వాహకులు ఇస్తారు. రంగులు, బ్రష్‌లను విద్యార్థులే తెచ్చుకోవాలి. ఇందుకు 2.30 గంటల సమయం విద్యార్థులకు ఇస్తారు. క్విజ్ పోటీల్లో పాల్గొనేవారు గ్రూప్‌కి ఇద్దరు మాత్రమే ఉండాలని తెలిపారు. పత్ర సమర్పణలో పాల్గొనేవారు తమ కళాశాల ఎంపిచేసిన పత్రాలను మాత్రమే చదవాలన్నారు. ఫొటోగ్రఫీలో పాల్గొనేవారు కేవలం డిజిటల్ ఇమేజ్‌లను సీడీ రూపంలోనే సర్పించాలని తెలిపారు. ఇందులో పాల్గొనే ప్రతి ఒక్కరికి సర్టిఫికెట్లను అందజేస్తామని కూడా తెలిపారు. మొదటి దశలో ఎంపికయిన వారికి ఈ నెల 12న శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో రాష్ట్రస్థాయిలో పోటీలు ఉంటాయన్నారు. చివరిగా మూడో దశకు ఎంపికయిన వారికి 27న సీఎం చేతుల మీద నుంచి బహుమతి ప్రదానం చేస్తారని కే.మృత్యుంజయరావు తెలిపారు.

## ఉచిత తీర్థయాత్రను ప్రారంభించిన మంత్రి

చిలకలూరుపేట : ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో నిరుపేద భక్తులకు ఆలయాల దర్శనం కల్పించినట్లు రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. మండలంలోని బొప్పూడి ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం వద్ద దేవాదాయశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని 186 మంది నిరుపేదలకు దివ్య దర్శనం పేరుతో ఏర్పాటు చేసిన ఉచిత తీర్థయాత్రను మంత్రి బుధవారం ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు 34989 మందికి ఈ అవకాశం కల్పించినట్లు తెలిపారు. రాజుల కాలంలో కులశేఖర్ మహారాజు శ్రీరంగరాజును దర్శించుకునేందుకు అప్పట్లో ఈ అవకాశం కల్పించారనీ, ప్రస్తుతం సీఎం చంద్రబాబునాయుడు ఇలాంటి కార్యక్రమానికి శ్రీకారం చుట్టి ఆధ్యాత్మిక భావాన్ని పెంపొందిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ సహాయ కమిషనర్ శ్రీనివాసరావు, సర్పంచి హరిబాబు, ఆలయ ఛైర్మన్ జనార్ధన్‌రావు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ధర్మకర్తల పాత్ర, బాధ్యతలు తెలియజేసేందుకే శిక్షణ తరగతులు

అన్నవరం : సనాతన ధర్మం, దేవాలయ సంప్రదాయాలు, దేవాదాయ చట్టం, దేవాలయ పరిపాలనా విధానము, ధర్మకర్తల పాత్ర, బాధ్యతలు తెలియజేసి.. వారిలో అవగాహన కల్పించేందుకు అన్ని దేవాలయాల ధర్మకర్తల మండలి సభ్యులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని రాష్ట్ర దేవాలయ పాలన సంస్థ డైరెక్టర్ సి.విజయ రాఘవాచార్యులు తెలిపారు. జిల్లాలోని కాకినాడ డివిజన్ పరిధిలోని దేవస్థానాల్లో ఇటీవల నియమించిన ధర్మకర్తల మండలి సభ్యులకు రెండ్రోజుల శిక్షణ కార్యక్రమాలను అన్నవరంలో ప్రారంభించారు. సత్యగిరిపై విష్ణుసదన్‌లో నిర్వహించిన తరగతులను విజయరాఘవాచార్యులు, దేవస్థానం ఛైర్మన్ ఐ.వి.రోహిత్ జ్యోతి ప్రకాశనం చేసి ప్రారంభించారు. అనంతరం ప్రత్యేకంగా ముద్రించిన దేవాలయ ధర్మకర్తల కరదీపికను వారు ఆవిష్కరించారు. అయితే తరగతులకు కనీస స్పందన కనిపించలేదు. పది మందిలోపే ధర్మకర్తలు హాజరు కావడం గమనార్హం.

# నూనె విక్రయ దుకాణంపై విజిలెన్స్

## అనుమతి లేని వ్యాపారంపై కేసు



శ్రీకాళహస్తి : విడిగా నూనె విక్రయాలకు అనుమతి పొంది.. ప్రధాన కంపెనీ లేబుళ్లతో నూనెప్యాకెట్లు, డబ్బాలు విక్రయిస్తున్న దుకాణంపై విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. పట్టణంలోని ఆంధ్రాబ్యాంకు సమీపంలో నూనె విక్రయ దుకాణం నడుస్తోంది. సాధారణంగా ఇక్కడ విడిగా నూనెలు అమ్ముకునేందుకు వీలుగా అనుమతులు పొందారు. ఇక్కడి దుకాణం నుంచి ప్రధాన కంపెనీ లేబుళ్లను టాంపరింగ్ చేసి ప్యాకెట్లు, డబ్బాల ద్వారా నూనె విక్రయాలు చేపట్టడంపై విజిలెన్స్ అధికారులకు సమాచారం అందింది. ఆ ప్రకారం విజిలెన్స్ వలయాధికారి వరదాచారి, డీసీటీవో శ్రీనివాసులు, చెన్నారెడ్డి సంయుక్తంగా దాడులు జరిపారు. అనుమతి లేకుండా నూనె ప్యాకెట్లు విక్రయించడం, అందులోనూ పలు కంపెనీల లేబుళ్లను టాంపరింగ్ చేయడంపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా వరదాచారి మాట్లాడుతూ ఈ దుకాణంలో కేవలం విడిగా నూనెను అమ్ముకునేందుకు అనుమతి ఉందని, లేబుళ్ల టాంపరింగ్, ప్యాకెట్లు, డబ్బాలుగా చేసి విక్రయించేందుకు ఎలాంటి అనుమతులు లేకపోవడంతో కేసు నమోదు చేసినట్లు వివరించారు.

# పాఠశాలల తనిఖీలకు సిద్ధంకండి

## డీఈవో శామ్యూల్



చిత్తూరు : పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశం, ఉపాధ్యాయుల బదిలీలు ముగిసాయి. ఇక పాఠశాలల్లో తనిఖీలు చేపట్టాలని డీఈవో శామ్యూల్ అధికారులను ఆదేశించారు. సర్వశిక్ష అభియాన్ కార్యాల యంలో డీవైఈవోలు, సెక్టోరియల్ అధికారులు, ఈఈ, సిబ్బందితో డీఈవో సమావేశమయ్యారు. నేటి నుంచి మండల, ఉప విద్యాశాఖాధికారులు, సర్వశిక్ష అభియాన్ సెక్టోరియల్ అధికారులు క్రమం తప్పకుండా పాఠశాలలకు వెళ్లి ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించి నివేదికలు అందజేయాలన్నారు. రేపటి నుంచి అధికారులందరూ నైట్ విజన్‌కి సన్నద్ధం కావాలన్నారు. వారంలో ఓ రోజు నైట్‌విజన్, ఓ రోజు ప్రభుత్వ వసతిగృహంలో నిద్ర చేయాలని సూచించారు. నెలలో 20 రోజులు పాఠశాలల సందర్శన చేయాలని పేర్కొన్నారు. సందర్శనకు వెళ్లినప్పుడు జీపీఆర్ఎస్ పద్ధతి ద్వారా అధికారుల ఏక్కడ ఉన్నారనే విషయాన్ని చరవాణి ద్వారా తెలియజేయాలన్నారు. భవిష్యత్తులో పాఠశాలల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ప్రణాళిక రూపకల్పన చేసుకోవాలని చెప్పారు. విద్యార్థుల సంఖ్య పెంపు, మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు.

ఈ సమావేశంలో సర్వశిక్ష అభియాన్ ఈఈ రవీంద్రబాబు, సెక్టోరియల్ అధికారులు రమేష్, అరుణ, మహ్మద్‌ఖాన్, లోకనాథం, డీవైఈవోలు విజయేంద్రరావు, పంకజాక్షి, విజయకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

# 11 నుంచి ఇంటింటికి తెదేపా

## జిల్లా నేతలకు దిశానిర్దేశం చేసిన సీఎం



కడప : ఈనెల 11 నుంచి ఇంటింటికి తెదేపా కార్యక్రమాన్ని విజయవంతం చేసి ప్రజల సమస్యలను పరిష్కార మార్గం చూపాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. విజయవాడలో పార్టీ కార్యశాల జరిగింది. జిల్లాకు చెందిన మంత్రి ఆదినారాయణరెడ్డి, రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్, తెదేపా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి తదితరులు హాజరయ్యారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ 11వ తేదీ నుంచి ఇంటింటికీ తెలుగుదేశం వెళ్లాలని సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే వాటిని గుర్తించి అక్కడికక్కడే పరిష్కరించేలా చూడాలన్నారు. ల్యాప్‌టాప్ ఉంటుందని అందులో అక్కడే నమోదు చేయాలని నిర్దేశం చేశారు. జలసిరికి హారతి కార్యక్రమంలో కూడా మన మార్కు కనపడాలని ఆదేశించారు.

కడప నాయకులు గురువారం నగర శివార్లలలోని వాటర్‌గండిలో జలహారతి చేపట్టనున్నట్లు వివరించారు. కార్యశాలలో విప్ మేడా మల్లికార్జునరెడ్డి, బద్వేలు ఎమ్మెల్యే జయరాములు, మండలి సభ్యులు రామసుబ్బారెడ్డి, బీటెక్ రవి, మండలి మాజీ వైస్‌ఛైర్మన్ సతీష్‌రెడ్డి, నాయకులు పుత్తా నర్సింహారెడ్డి, సుధాకర్‌యాదవ్, వరదరాజులరెడ్డి, విశ్వనాథ నాయుడు, బత్యాల చెంగల్రాయుడు, రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విలువల విద్యను అందించండి ఒత్తిడి పెంచే బోధన వద్దు

## జిల్లా పాలనాధికారి ప్రద్యుమ్న



చిత్తూరు : మన సంస్కృతి సంప్రదాయాల్లో విశేష స్థానం కేవలం గురువుకే దక్కుతుంది. ఉన్నత విలువలతో కూడిన విద్యను నేర్పించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దండి. ఒత్తిడితో కూడిన విద్య వద్దు. బట్టీ పట్టించి ఎంత నేర్పించినా ప్రయోజనం ఉండదన్న విషయాన్ని ఉపాధ్యాయులు గుర్తించుకోవాలి. విద్యార్థి కష్టంగా కాకుండా ఇష్టంగా నేర్చుకునేలా చూడటమే ప్రతి ఉపాధ్యాయుడి లక్ష్యం కావాలని జిల్లా పాలనాధికారి పీఎస్.ప్రద్యుమ్న ఉపాధ్యాయులను కోరారు. జిల్లా విద్యాశాఖ, సర్వశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో గురు పూజోత్సవం చిత్తూరులోని షర్మన్ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించారు.

ఈ సందర్భంగా పాలనాధికారి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందజేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని తెలిపారు. తెరపై బోధన జరుగుతుందని అన్ని పాఠశాలల్లో ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఉదయం ఐరాల మండలం బీరప్పచెరువు ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శిం చడం జరిగిందన్నారు. ఆ పాఠశాలకు మౌలిక వసతులు కల్పించాలని తల్లిదండ్రులు కోరారని, అన్ని వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించామని తెలిపారు. ఎమ్మెల్సీ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యున్నత పాఠశాలలు ఉన్న జిల్లా మనదేనన్నారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే విధంగా ఉపాధ్యాయుల బోధన ఉండాలని సూచించారు. జిల్లా విద్యాశాఖాధికారి శామ్యూల్ మాట్లాడుతూ సబ్జెక్టును విద్యార్థి ఆసక్తికరంగా వినే విధంగా బోధన ఉండాలని తెలిపారు. జిల్లాలో 3.60లక్షల మంది పిల్లలు ప్రభుత్వ బడుల్లో చదువుతున్నారని, రేపటి విద్యాసంవత్సరంలో ఈ సంఖ్య 4 లక్షలకు పెరగాలన్నారు. ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విధంగా బోధన అందించాలన్నారు. నగర మేయరు కఠారి హేమలత మాట్లాడుతూ ప్రతి విద్యార్థి జీవితాన్ని మలుపుతిప్పేది గురువులేనన్నారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు, పుత్తూరు, మదనపల్లె ఉప విద్యాశాఖాధికారులు విజయేంద్రరావు, విజయకుమారి, ఫంకజాక్షి, సెక్టోరియల్ అధికారులు రమేష్, లోకనాథం, మహ్మద్‌ఖాన్, అరుణ, ఎంఈవోలు, పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, కార్పొరేటర్ అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంలో విశిష్ట సేవలు అందించిన ఉపాధ్యాయుల్లో జిల్లా స్థాయి పురస్కారాలకు 37మందిని ఎంపిక చేశారు. వీరిలో ఇద్దరు మండల విద్యాశాఖాధికారులు, తొమ్మిది మంది ప్రధానోపాధ్యాయులు, 10 మంది పాఠశాల సహాయకులు, 16 మంది సెకండరీ గ్రేడు ఉపాధ్యాయులు ఉన్నారు. వీరందరిని జిల్లా పాలనాధికారి, ఎమ్మెల్సీ, డీఈవో, మేయరు దుశ్శాలువ, జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

# కాకినాడ సెజ్‌లో పెట్రో కెమికల్స్ ప్రాజెక్టు

## భూమి, ఇతర వసతుల కల్పనకు ప్రాధాన్యం

## కలెక్టర్ కార్తికేయ మిశ్రా వెల్లడి



కాకినాడ : కాకినాడ తీరంలో ఏపీ పెట్రో కెమికల్స్ ప్రాజెక్టు ఏర్పాటుకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించడానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని కలెక్టర్ కార్తికేయ మిశ్రా వెల్లడించారు. కలెక్టరేట్‌లో ఏపీ పెట్రో కెమికల్ ప్రాజెక్టు ఏర్పాటుకు సంబంధించి జీఎంఆర్-కేఎస్ఈజెడ్, గెయిల్, హెచ్‌పీసీఎల్ ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన భూమి, నీరు, విద్యుత్తు, రహదారులు వంటి మౌలిక సదుపాయాల కల్పనపై చర్చించారు. ఉత్పాదక యూనిట్లు త్వరగా నెలకొల్పాలని కోరారు. ఈ ఏడాది జనవరిలో విశాఖపట్నంలో జరిగిన పారిశ్రామిక సదస్సులో ఏపీ పెట్రో కెమికల్ ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వం గెయిల్, హెచ్‌పీసీఎల్ సంస్థలతో ఒప్పందం చేసుకుంది.

ఈ ప్రాజెక్టుకు కెఎస్ఈజెడ్‌లో 2వేల ఎకరాల భూమిని గుర్తించామని, ఇక్కడ పనిచేసే ఉద్యోగుల టౌన్‌షిఫ్ అభివృద్ధికి 150 ఎకరాలు ఇచ్చేందుకు సంస్థ సిద్ధంగా ఉందని, ముడిసరకు దిగుమతి, నిల్వకు కెఎస్‌పీఎల్ పోర్టు 100 ఎకరాలు కేటాయించనుందని తెలిపారు. ఇక్కడ నీటి అవసరాలకు ఒక టీఎంసీ సరఫరా చేసేందుకు అవకాశం ఉందని, పోలవరం ఎడమ మెయిన్ కెనాల్ నుంచి గ్రావిటీ, పంపింగ్ ద్వారా కేటాయించేందుకు జలవనరుల శాఖకు దరఖాస్తు చేయాలని సూచించారు. విద్యుత్తు అవసరాలకు పిఠాపురంలోని 132కేవీ విద్యుత్తు కేంద్రం నుంచి సరఫరా ఇస్తామన్నారు. 210 మెగావాట్స్ విద్యుత్తు సరఫరాకు 60 ఎకరాల్లో 400కేవీ విద్యుత్తు కేంద్రాన్ని నిర్మిస్తామని కలెక్టర్ వివరించారు. గెయిల్ సంస్థ చీఫ్ జనరల్ మేనేజరు అశ్విని కుమార్‌గుంబర్, హెచ్‌పీసీఎల్ జీఎం అభిషేక్ త్రివేది మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు ఏర్పాటుకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలపై హర్షం వ్యక్తం చేస్తూ సాధ్యమైనంత త్వరగా సీఎం చంద్రబాబుతో శంకుస్థాపన చేయిస్తామన్నారు. సమావేశంలో జీఎంఆర్ సంస్థ ఉపాధ్యక్షుడు రామరాజు, జీఎం నాయుడు, ఏపీఐఐసీ జోనల్ మేనేజరు గోపీ కృష్ణ, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం ఏవీ పటేల్, జలవనరుల శాఖ ఎస్ఈ రాంబాబు, సుగుణాకరరావు, ట్రాన్స్‌కో ఎస్ఈ శ్యామ్‌ప్రసాద్, ఆర్డీవోలు రఘుబాబు, విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో వనం-మనం కార్యక్రమం ద్వారా నాటిన మొక్కలను సంరక్షించాలని కలెక్టర్ కార్తికేయ మిశ్రా ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో అటవీ, డ్వామా శాఖల అధికారులతో ఆయన వనం-మనంపై సమీక్షించారు. జులై 1 నుంచి ఇప్పటి వరకూ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో 1.52కోట్ల మొక్కలు నాటడం జరిగింది. వీటిని జాగ్రత్తగా పెంచాలన్నారు. అలాగే డ్వాక్రా సంఘాల ద్వారా నాటించిన మొక్కల సంరక్షణ బాధ్యత మహిళా సంఘాలకు అప్పగించాలని సూచించారు. సమావేశంలో జిల్లా అటవీ అధికారిణి నందని సలారియా, డ్వామా పీడీ రాజకుమారి, సామాజిక వన విభాగం డీఎఫ్ఓ ప్రసూన పాల్గొన్నారు.




## చిగుళ్ల జబ్బుతో బాధపడుతున్నారా?



*(నిన్నటి సంచిక తరువాయి )*

**క్యూరటాజ్...**

చిగుళ్ల వ్యాధి జింజివైటిస్ అన్న ప్రాథమిక దశలో ఉంటే క్యూరటాజ్ అనే చికిత్స అవసరమవుతుంది.

**ఫ్లాప్ చికిత్స...**

చిగుళ్ల వ్యాధి జింజివైటిస్ అనే దశను దాటి పెరియోడాంటైటిస్ అనే దశకు చేరితే దానికి ఫ్లాప్ చికిత్స అవసరమవుతుంది.

**బోన్ గ్రాఫ్టింగ్...**

చిగుళ్ల వ్యాధి వల్ల పంటి ఎముక బలహీనమైపోతే దాన్ని దృఢపరచడానికి బ్రోన్ గ్రాఫ్టింగ్ అనే చికిత్స చేయాల్సి ఉంటుంది.

**నివారణ ఇలా...**

ఈ సమస్యలన్నింటినీ నివారించడానికి రోజు రెండుసార్లు ఫ్లోరైడ్ ఉన్న టూత్‌పేస్టుతో బ్రష్ చేసుకోవాలి. పళ్ల మధ్యలో బ్రష్ చేరలేని చోట ఉండే పాచిని తొలగించడానికి ఫ్లాసింగ్ (దారం వంటి దానితో పళ్ల మధ్యన ఉండే ప్రాంతంలో శుభ్ర చేయడం) చేసుకోవాలి. చక్కెర ఎక్కువగా ఉండే పదార్థాలు, పిండిపదార్థాలు ఎక్కువగా ఉండే ఆహారాలను పరిమితంగా తీసుకోవాలి.

నోటికి అతుక్కుపోయే ఆహారాలు, శ్నాక్స్‌ను తక్కువగా తీసుకోవాలి. తందాలకు బలం చేకూర్చే సమతుల పోషకాహారం తీసుకోవాలి. సిగరెట్, ఇతర పొగాకు ఉత్పత్తులను వాడే అలవాటును పూర్తిగా మానేయాలి. పళ్లను శుభ్రం చేయడం అన్నది కేవలం బ్రషింగ్‌వల్ల మాత్రమే సాధ్యంకాదు. అందుకే రోజూ రెండు సార్లు బ్రష్ చేసినప్పటికి, రోజుకు కనీసం ఒకసారి మౌత్‌వాష్‌తో శుభ్రం చేసుకుంటే నోటిలోని బ్యాక్టీరియా పెరుగుదల అదుపులో ఉంటుంది. టూత్‌బ్రష్ అన్నది మెకానికల్ క్లీనింగ్‌కు ఉపయోగపడితే, మౌత్‌వాష్ అన్నది కెమికల్ క్లీనింగ్‌కు ఉపయోగపడుతుంది.

డెంటిస్ట్ సూచించిన షెడ్యూల్ ప్రకారం ప్రతి ఆర్నెల్లకు ఓసారి ఇంటిలోని కుటుంబ సభ్యులంతా స్కేలింగ్ ప్రక్రియ ద్వారా శుభ్రం చేయించుకోవడం అవసరం. దీనివల్ల ఎలాంటి దుష్ప్రభావాలు (సైడ్‌ఎఫెక్ట్స్) ఉండవు. పళ్లు అరిగిపోతాయన్నది, దంతాలు వదులైపోతాయ న్నది, పళ్ల మధ్య సందులు వస్తాయన్నది కేవలం అపోహ మాత్రమే.

**గుర్తుంచుకోవాల్సిన అంశం:**

చిగుళ్ల వ్యాధులు వచ్చినవారిని పరిశీలిస్తే చాలామట్టుకు కుటుంబ సభ్యులలో వంశపారంపర్యంగా ఈ వ్యాధి కనిపించే అవకాశాలు ఎక్కువ. కాబట్టి పళ్లు వదులై పడిపోయిన కుటుంబ చరిత్ర (ఫ్యామిలీ హిస్టరీ) ఉన్నవారు తప్పనిసరిగా దంతవైద్యు డిని సంప్రదించాలి. అంతేకాదు.. చిన్న వయ సులోనే ఎవరికైనా పళ్లు ఊడిపోతే వారి పిల్లలు మరింత జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది.

**జాగ్రత్తలు:**

ఐదేళ్లుగా ఎప్పుడూ దంతవైద్యుడిని కలిసి ఏ రకమైన దంత వైద్య చికిత్సను తీసుకోని వారిలో చిగుళ్ల వ్యాధులు ఉండే అవకాశం చాలా ఎక్కువ. కాబట్టి మీరు ఈకోవలోకి వచ్చేవారైతే తప్పనిసరిగా దంతవైద్యుడిని కలవాలి. కేవలం దంత సంబంధమైన సమస్యలు వచ్చినప్పుడే కాకుండా ప్రతి ఆర్నెల్లకు ఓ మారు విధిగా దంతవైద్యుడితో పళ్ల పరీక్షలు చేయించుకోవాలి. ఇంట్లోని కుటుంబ సభ్యులంతా ఈ నియమాన్ని తప్పనిసరిగా పాటించాలి.

**బ్రషింగ్‌లో జాగ్రత్తలు:**

బ్రష్ చేసుకునేందుకు మృదువైన బ్రిజిల్స్ ఉన్న బ్రష్‌నే వాడండి. కిందివరసలో చిగుళ్లూ, పళ్లూ కలిసే చటు వరకు నిలువుగా బ్రష్ చేసుకోండి. చాలా మృదువుగా బ్రష్ చేసుకోండి. రఫ్‌గా బ్రష్ చేసుకుంటే అది మీ చిగుళ్లకు హాని చేకూర్చవచ్చు. అలాంటప్పుడు అవి త్వరగా వ్యాధుల బారిన పడే అవకాశం ఉంటుంది. చేత్తో చిగుళ్లపై మృదువుగా మసాజ్ చేసినట్లు రుద్దితే దంతాల ఆరోగ్యం మెరుగుపడుతుంది.

# హై బిపినా...! ఈ ఆహారాలు తీసుకోండి



ఉప్పులేని కూరలా రుచించకపోవచ్చు. కానీ తప్పదు.. జీవితంలో కొన్నింటికి అలవాటు పడాల్సిందే! ప్రతి ఇంట్లో ముఖ్యంగా నిల్వ ఉండే వస్తువు ఉప్పు. వంటకాల్లో తప్పనిసరిగా ఉపయోగిస్తుంటారు. ఉప్పు అధికంగా ఉన్న ఆహారాలను తీసుకోవడం వల్ల చాలా రకాల వ్యాధులను ఎదుర్కోవల్సి వస్తుంది. ఇవి హైపోథైరాయిడ్ మొదలుకొని హై బ్లడ్ ప్రెజర్ వరకూ దారితీస్తుంది. ఉప్పులో ముఖ్యంగా సోడియం ఉంటుంది. ఇది ఆరోగ్యానికి చాలా అవసరం. శరీరంలో సోడియం లోపిస్తే తలనొప్పి, తలతిరగడం, శరీర బరువు పెరగడం, వంటి ఆరోగ్యసమస్యలు అధికంగా ఉంటాయి. అదే సోడియం ఎక్కువైతే హైబీపి, బ్లడ్ ప్రెజర్ వంటి అనారోగ్యసమస్యలను ఎదుర్కోవల్సి వస్తుంది. ఈ సోడియంను ఉప్పులో మాత్రమే కాక మనం ప్రతి రోజూ వంటలకు ఉపయోగించే మరికొన్ని మూలికల్లో కూడా కనుగొనబడింది. చాలా ఆహారాల్లో సోడియం కంటెంట్ చాలా తక్కువగా ఉంటుంది. మనం సాధారణంగా ఉపయోగించే చాలా మసాలా దినుసుల్లో మరియు మూలికలను ఉపయోగించడం వల్ల రుచి మాత్రమే కాదు ఈ నేచురల్ హెర్బ్ లో ఔషధ గుణాలు కూడా మెండుగా ఉన్నాయని మనకు తెలుసు. అవి కూడా సాల్ట్ కు ప్రత్యామ్నాయంగా పనికొస్తాయి. లేదా ఉపయోగించుకోవచ్చు. మూలికలు మరియు మసాలా దినుసులు అంటే పెప్పర్, వెల్లుల్లి, అల్లం, తులసి, మరియు యాలకులు వంటి వాటిని ఉపయోగించి రుచికరమైన వంటలను వండటం వల్ల మన నోట్లో నీరు ఊరాల్సిందే. ఇవి మసాల దినుసులు మాత్రమే కాదు, ఉప్పుకు ప్రత్యామ్నాయాలు కూడా. హైబీపి ఉన్నవారు కొన్ని వ్యాధులు రాకుండా తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కోసం ఈ సాల్ట్ ఆల్టర్నేటివ్స్ (ఉప్పు నిల్వ ఉన్న మసాలా దినుసులు మరియు హెర్బ్స )ను ఉపయోగించి ఆనందమయిన జీవితాన్ని గడపవచ్చు. ఈ మసాలా దినుసులు మరియు మూలికల్లో సోడియం తక్కువగా ఉండటమే కాదు, ఇది ఆరోగ్యానికి మరియు మంచి టేస్ట్ ను అందించడంలో కూడా మంచివి. **చెక్క:** మనకు తెలిసినంత వరకూ చెక్కను పురాతన కాలం నుండినే ఒక మసాలా దినుసుగా ఉపయోగిస్తున్నారు. ముఖ్యంగా మన ఇండియాలోనూ, శ్రీలంక మరియు ఆసియాలోని ఇతర దేశాల్లో కూడా వీటి వాడం ఉంది. ఇది ఉప్పు కు ప్రత్యామ్నాయంగా దీన్ని ఉపయోగించవచ్చు. ఇది బ్లడ్ షుగర్ లెవల్స్ ను రెగ్యులేట్ చేయడానికి సహాయపడుతుంది. మరియులో కొలెస్ట్రాల్ కలిగి ఉంటుంది. **యాలకులు:** సాధారణంగా చాలా మంది యాలకులతో తయారు చేసి టీ త్రాగుతుంటారు. దీని రుచి అల్లం వాసనతో, కొంచెం ఉప్పు టేస్ట్ ను కలిగి మంచి రుచికరంగా ఉంటుంది. కాబట్టి ఉప్పుకు ప్రత్యమ్నాయంగా యాల కులను ఉపయోగించవచ్చు. ముఖ్యంగా ధనియాలు, మరియు ధనియాలతో కలిపి వీటిని తీసుకోవచ్చు.

**తులసి:** సాధారణంగా చెప్పుకొనే మూలికల్లో తులసి కూడా ఒకటి. మన భారత దేశంలో చాలా వంటకాల్లో తులసి ఆకులను ఉపయోగిస్తారు. ఈ ఆకులు అధిక రుచిని కలిగి ఉంటాయి మరియు కొద్దిగా తీపిగా కూడా ఉంటాయి. ఇది కేవలం ఒక వైద్యపరమైన ప్రయోజనాలు కలిగి ఉండటమే కాదు, ఇది ఉప్పు కు ప్రత్యామ్నా యంగా కూడా ఉపయోగిస్తారు. **రెడ్ చిల్లి:** వీటిని రెడ్ చిల్లి పెప్పర్ అంటారు. ఇది ఉప్పుకు ఒక వర్ణనాత్మక ప్రత్యామ్నాయం ఉంటుంది. విస్తృతంగా స్పానిష్, మెక్సికన్ మరియు ఇండియన్ వంటకాల్లో ఉపయోగిస్తారు. ఇవి ఎక్కువ కారం కలిగి ఉండి మరియు పెప్పర్ ఫ్లేవర్స్ తో ఉండి ఉప్పుకు మంచి ప్రత్యామ్నాయం. **బే లీఫ్:** బే లీఫ్ ను బిర్యాని ఆకు అంటారు. దీన్ని అధికంగా మసాలా వంటలకు మరియు బిర్యానీ, మాంసాహార వంటలకు తప్పనిసిరగా ఉపయోగిస్తుంటారు. ఈ స్వీట్ మరియు సువాసన కలిగించే ఆకులు ఎండిన తర్వాత మంచి సువాసన కలిగిస్తాయి. ఆహారాలను రుచిగా చేసే మసాలా దినుసుల్లో ఇది కూడా ఒకటి. **వెల్లుల్లి పౌడర్:** వెల్లుల్లి పౌడర్ ను ఉప్పుకు ప్రత్యమ్నాయం అని చెప్పొచ్చు. ఇది వంటలను రుచిగా మార్చడమే కాదు, ఇందులో ఔషధగుణాలు కూడా పుష్కలంగా ఉన్నాయి. వెల్లుల్లి పొడిన మాంసాహారాల్లోనూ, ఫిష్ వంటకాల్లోనూ మరియు పాస్తా వంటకాల్లోనూ ఉపయోగిస్తారు. **బ్లాక్ పెప్పర్(మిరియాలు):** బ్లాక్ పెప్పర్ మరియు ఉప్పుకు పెద్ద వ్యత్యాసం ఉండదు. బ్లాక్ పెప్పర్ సాల్ట్ కు ప్రత్యామ్నాయంగా చాలా బాగా సహాయపడుతుంది. అంతే కాదు ఇది మంచి సువాసన కలిగి ఉంటుంది. **సోయా సాస్:** సోయా సాస్ కూడా ఉప్పుకు మంచి ప్రత్యామ్నాయం. ఇందులో అధికంగా సాల్ట్ కలిగి ఉండటం వల్ల ఆహారాల్లో ఉపయోగించడం వల్ల మంచి రుచిని అంధిస్తుంది. అంతే కాదు ఇందులో అధిక పోషకాంశాలున్నాయి కాబట్టి ఇది ఆరోగ్యానికి కూడా చాలా మంచిది. కాబట్టి సోయాను మన డైలీ డయట్ లో చేర్చడం వల్ల ఎక్కువ కాలం జీవిచంగలుగుతాం. **ఉల్లిపాయ పౌడర్:** ఉల్లిపాయను వెజిటేబుల్ గా వర్ణిస్తారు. ఇది అద్భుతమైన రుచికి చాలా ప్రసిద్ధి. అయితే ఇది ఉప్పుకు ప్రత్యామ్నాయంగా ఉపయోగించే అద్భుతమైన రుచి మరియు పోషకాంషల్లో ఒకటైన సల్ఫర్ అధికంగా ఉండటం చేత దీన్ని తగు మోతాదులో ఉపయోగించాలి.

**నిమ్మకాయ:** తాగా ఉన్న నిమ్మరసం ఒక సహజ సంరక్షణకారిని అంటారు. మరియు ఒక అద్భుతమైన ఉప్పు ప్రత్యామ్నాయంగా ఉపయోగించవచ్చు. నిమ్మరసం ఒక సహజ సంరక్షణకారినిగా పనిచేస్తుంది, కాబట్టి దీన్ని తాజాగా ఉన్నప్పుడు మాత్రమే దీన్ని ఉపయోగించాలి.

## మీ పిల్లలలో సృజనాత్మకత త్వరగా పెంచండి!

పిల్లలు చిన్న వయసులో వుండగానే వారిలో ఆలోచనా పరిధి పెరుగుతుంది. ఆటపాటలతో, మంచి విద్యాబుద్ధులతో వీరిలో సృజనాత్మకత పెంచవచ్చు. మీ చిన్నారులకు చిన్నతనంనుండే తమలోని ఊహ శక్తిని అధికం చేసుకునేందుకు అవకాశం ఇవ్వండి. వారి మనసులలోని విషయాలను ఊహలను ఏ రకంగా పెంచి వారిని స్వతంత్రులుగాను మంచి పౌరులుగాను తీర్చిదిద్దడమెలా? అనేది పరిశీలిద్దాం.

***ఒక కథ చెప్పండి*** - ఊహా శక్తి పెరగటానికి గాను పిల్లలకు కథలు చెప్పాలి. సాధారణంగా పిల్లలకు కథను మించిన సాధనం లేదు. కథలే పిల్లలకు ప్రపంచం అంటే ఏమిటో తెలియజేస్తాయి. బొమ్మలు, విద్యాపర ఛార్టులు, ఇతర ఆటవస్తువులు, వంటివి పిల్లలకు మంచి అనుభవాలను అందిస్తాయి. రోజులో జరిగే చర్యలను కథలద్వారా వివరించండి. పిల్లల ఆసక్తిని నిర్మాణాత్మకంగా మలచాలి. ప్రతి కథా ఆసక్తికరం గా చేయవచ్చు. అవి వారికి పెయింటింగ్, కుకింగ్ మొదలైన విషయాలను తెలియజేస్తాయి.

**ముగింపు** - పిల్లలకు కథ అంతా చెప్పిన తరువాత కథ ముగింపు ఆలోచించి వారినే చెప్పమనాలి. అపుడు వారిలో ఊహ శక్తి పెరుగుతుంది. ముగింపులకు కూడా ప్రత్యామ్నాయాలు సూచించమనాలి.

ఉదాహరణకు డినోసార్ జంతువులు మనం కూర్చున్న థియేటర్ లోకి వస్తే ఏం చేస్తావని ప్రశ్నించాలి. పిల్లలకు వారి బొమ్మలలో రంగులవారీగా వరుసలో పెట్టమని చెప్పాలి. వారి గదిని సర్దుకోవటంలో కొంత సమయం కేటాయించి ఏది ఎక్కడ పెట్టాలో తెలుపాలి. వారి ఆట వస్తువులను పెద్దవి, మీడియం, చిన్నవి గా ఏర్పాటు చేయమనాలి. వారిలో లెక్కలు, రీజనింగ్ మైండ్ అభివృద్ధి చెందుతుంది.

**చురుకు** - పిల్లలను చురుకుగా వుంచాలి. వారికి వేటిపట్ల ఆసక్తి వుందో గమనించాలి. దానికి సంబంధించిన పిల్లలతో వారికి స్నేహం ఏర్పరచాలి. ఉదాహరణకు పిల్లవాడికి మ్యూజిక్ అంటే ఆసక్తి వుంటే, అతను నేర్చుకుంటుంటే, మ్యూజిక్ బాగా తెలిసిన పిల్లలను పిలిచి ఇంటిలో ఒక ప్రొగ్రాము ఏర్పరచండి. అదే రకంగా వారిని కథలు వ్రాయమని కూడా ప్రోత్సహించండి. వారి ఆలోచనా శక్తి పెంచేందుకు ఒక పక్షి, గుర్రం, డాల్ఫిన్ వంటి వాటి గురించి వ్రాయమనండి. పజిల్స్, బోర్డ్ గేములు, బిల్డింగ్ బ్లాకులు, వారిలో ఆలోచన పెంచుతాయి. చిన్నతనం నుండి వారికి వ్రాయడం నేర్పిస్తే, ఆలోచనా పరిధి పెరుగుతుంది.

**ఆసక్తి** - పిల్లలకు ఏ రంగంలో ఆసక్తి వుందో పరిశీలించండి. వారికి ఆసక్తికల రంగాలలో మీరు ప్రోత్సహించినట్లయితే, వారి ప్రతిభా పాటవాలు పెరిగి అందులో ఉన్నతులవుతారు. మిడ్డను ఆలోచించనివ్వండి.

స్వేచ్ఛగా తన భావాలను ప్రకటించనివ్వండి. అతనికై అతనే వాస్తవాలను వెల్లడిచేయనివ్వండి.

మీ బిడ్డ ఆలోచనలకు విలువనివ్వండి. పిల్లలు వారున్న పరిస్థితులనుండే నేర్చుకుంటారు. గుర్తింపునిస్తే వారు లక్ష్యాలను ఏర్పరచుకుంటారు. ప్రోత్సహిస్తే తమలో ఆత్మవిశ్వాసం పెంచుకుంటారు.


# సుగర్ వ్యాధికి స్వీట్సే కారణమా!?



స్వీట్లు ఎక్కువ తింటే మధు మేహం వస్తుందన్న అపోహ ఉంది. అయితే చక్కెర పదార్థాలు తినడం వల్లే షుగర్ వ్యాధి వస్తుందనేది ఎంతమాత్రం నిజం కాదంటున్నారు వైద్యులు. మనం ఎలాంటి ఆహార పదార్థాలు తీసు కున్నప్పటికీ అది చివరికి గ్లూకోజ్ గా మారి శరీరానికి కావలసిన శక్తిని అందించేందుకు ఉప యోగపడుతుంది. అవసరానికి మించి గ్లూకోజ్ శరీరంలో ఉన్నప్పుడు అది గ్లైకోజన్‌గా మారి కాలేయంలో నిలువ ఉంటుంది. అయితే గ్లైకోజన్‌గా మారేందు కు అవసరమైన ఇన్సులిన్ అనే హార్మోనును క్లోమగ్రంథి విడుదల చేస్తుంది. శరీరంలో తగినంత ఇన్సులిన్ లేకపోయినా, క్లోమ గంథి సరిగా పనిచేయలేక పోయనా.. గ్లూకోజ్, గ్లైకాన్‌గా మారలేదు.. దీంతో గ్లూకోజ్ అంతా రక్తంలో పేరుకుపోతుంది.

దీన్నే మనం షుగర్ వ్యాధిగా పరిగణిస్తాం. కనుక చక్కెర పదార్థాల తినడం ద్వారా షుగర్ వ్యాధి వచ్చే అవకాశాలు చాలా తక్కువ.. ప్రతి రోజూ వ్యాయామం చేస్తూ ఉంటే అనారోగ్య సమస్యేలు తలెత్తవు. అయితే ఇప్పటికే షుగర్ వ్యాధితో బాధపడుతున్న వారు చక్కెర పదార్థాలను తీసుకోకపోవటం మంచిది.

## సీఓపిడి తో జాగ్రత



*(నిన్నటి సంచిక తరువాయి )*

మంది సిగరెట్లు తాగేవారే కావడం గమనార్హం. ఇతరులు వదిలే సిగరెట్ పొగవల్ల సీఓపిడి 130శాతం పెరుగుతోందని తేలింది. క్యాబేజీ, గోబిపువ్వు, బ్రకోలీ వంటి కూరగాయల్లో ఐసోదియోనయనేట్లు అధికంగా ఉంటాయి. ఇవి పొగవల్ల ఊపిరితిత్తులు దెబ్బతినకుండా అడ్డుకుంటాయి. పట్టణాల్లో దుమ్ము, దూలి, నుసి పొగకు ఎక్స్‌పోజ్ కాకుండా చూసుకోవాలి. రద్దీ ప్రదేశాల్లో, రోడ్ల ప్రక్కన వ్యాయామం వంటివి చేయకుండా చూసుకోవాలి. వ్యాయామం సమయంలో ఊపిరితిత్తులు ఆక్సీజన్‌ను ఎక్కువగా గ్రహిస్తాయి. అధిక బరువు ఊపిరితిత్తు పనితీరు దెబ్బతీస్తుంది. బీఎంఐ 30కన్నా తక్కువ ఉన్నవారు బరువు తగ్గించుకోవాలి. **స్మోకర్స్ కాఫ్** దీర్ఘకాలపు దగ్గుకు అతి ప్రధాన కారణం ధూమపానం. సిగరెట్లు తాగేవారిలో కనిపించే నుసిదగ్గు (స్మోకర్స్ కాఫ్) ఎంఫైసిమా అనే ప్రమాదకరమైన సరిచేయలేని ఊపిరితిత్తుల వ్యాధికి సూచన. సిగరెట్ పొగకు పరోక్షంగా గురికావటం వల్ల కూడా ఊపిరితిత్తుల వ్యాధులు, దానిని అనుసరించి దగ్గూ వచ్చే రిస్క్ ఉంటుంది.

# చిత్రభాను

## కొడుకు ఎంట్రీపై బాలయ్య ప్రకటన



బాలకృష్ణ వారసుడు నందమూరి మోక్షజ్ఞ త్వరలో తెరంగ్రేటం చేయబోతున్న సంగతి తెలిసిందే. గత రెండేళ్లుగా ఇందుకు సంబంధించిన చర్చ నడుస్తోంది. ఒకానొక సందర్భంలో బాలయ్య ఎక్కడికెళ్లినా.... మోక్షజ్ఞను ఎప్పుడు పరిచయం చేస్తున్నారు అనే ప్రశ్నలు ఎదురయ్యేవి.

అయితే మోక్షజ్ఞ ఎంట్రీ ఎంతో దూరంలో లేదని, వచ్చే ఏడాది జూన్ నాటికి మోక్షు సినిమా ఇండస్ట్రీకి పరిచయం కాబోతున్నాడని బాలయ్య తెలిపారు. బాలయ్య ప్రాతినిధ్యం వహిస్తున్న హిందూపురంలో అభిమానులు మోక్షజ్ఞ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలయ్య ఈ ప్రకటన చేశారు. మోక్షజ్ఞ జన్మదిన వేడుకల్లో బాలయ్య చాలా ఉత్సాహం కనిపించారు. అభిమానులతో కలసి పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్న ఆయన స్వయంగా కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. నందమూరి అభిమానులు మోక్షజ్ఞ లాంచింగ్ కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారని, వారందరి కోరికా త్వరలోనే నెరవేరుతుందని చెప్పారు.

### క్రికెటర్‌తో
## తమన్నా పెళ్ళి...!

సౌత్‌తోపాటు బాలీవుడ్‌లో రాణిస్తున్న తమన్నా భాటియా వివాదాలకు బహుదూరంగా ఉంటుందనడంలో ఎలాంటి సందేహం అక్కర్లదు. కానీ తాజాగా ఆమె పెళ్ళి వార్త మీడియాలో చక్కర్లు కొడుతున్నది. క్రికెటర్ అబ్దుల్ రజాక్‌ను వివాహం చేసుకోబోతున్నారనే న్యూస్ సంచలనం రేపుతున్నది. అయితే అందులో ఎంత వాస్తవం ఉందో తెలుసుకోవాలంటే.. ఈ వార్తపై తమన్నా స్పందించాల్సిందే, అబ్దుల్ రజాక్ పాక్ తరపున పలు అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన సంగతి తెలిసిందే. ఈ వార్తకు సంబంధించిన వివరాలు ఇవే.. పాకిస్థాన్ క్రికెటర్ అబ్దుల్ రజాక్ ని మిల్కీ బ్యూటీ తమన్నా పెళ్ళాడబోతుందనే వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అయితే ఇలాంటి రూమర్ ఎక్కడ నుంచి పుట్టుకొచ్చిందని అందరు ఆరా తీస్తున్నారు. తమన్నా, అబ్దుల్ రజాక్ ఇద్దరు కలిసి నగల దుకాణంలో కలిసి ఉన్న ఫోటో నెటిజన్ల కంట పడటటం వార్తకు బలం చేకూరింది. దాంతొ తన ప్రియుడితో కలిసి పెళ్ళి షాపింగ్ చేస్తుందని జోరుగా ప్రచారం చేస్తున్నారు. అసలు ఈ ఫోటో వెనుక ఉన్న కథ ఏమిటంటే ఈ పిక్ 2013 నాటిది., అప్పట్లో దుబాయ్ లోని ఓ షాప్ ఓపెనింగ్ కి తమన్నా, రజాక్ వెళ్ళారు. ఆ ఫోటో అప్పుడు క్లిక్ చేసిందే . ఇప్పుడు ఈ పిక్ ని వైరల్ గా మార్చి తమన్నా పెళ్లి పీటలెక్కనుందని రూమర్స్ పుట్టించారు. బాహుబలిలో అవంతికగా నటించి జాతీయంగా గుర్తింపు తెచ్చుకున్న తమన్నా పెళ్లి వార్త కొద్ది రోజులుగా హాట్ టాపిక్ గా మారడంతో ఇటు సౌత్ , అటు బాలీవుడ్ అభిమానులు షాక్ అయ్యారు. అసలు విషయం తెలుసుకున్న అభిమానులు ఊపిరి పీల్చుకొన్నారు, తమన్నా గతంలో ఓ ఇంజనీర్ ని పెళ్లి చేసుకోబోతుందని రూమర్లు రాగా వాటిని తమన్నా ఖండించింది., నా జీవితంలోకి ఎవరైన అడుగు పెడితే నేనే మొదట మీ అందరికి చెబుతాను అని మిల్కీ బ్యూటీ స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. సినిమాల విషయానికి వస్తే తమన్నా పలు తమిళ సినిమాలతో బిజీగా ఉన్నారు. ఎన్టీఆర్ సరసన జై లవకుశ లో ఓ ఐటెం సాంగ్ చేయనున్నట్టు సమాచారం.



## బికినీ వేసుకోవడం ఏమైనా నేరమా?




రాఘవేంద్రరావు తన బొడ్డు మీద కొబ్బరి చిప్పలతో కొట్టిన అంశాన్ని హీరోయిన్ తాప్సీ ఓ టీవీ షోలో రచ్చ రచ్చ చేసిన సంగతి తెలిసిందే. ఈ విషయంలో తాప్సీకి, తెలుగు సినీ అభిమానులకు మధ్య కొన్ని రోజుల క్రితం చాలా పెద్ద చర్చ జరిగింది. %జుతీతీశితీ శ్రీశ్ఖుఎఱఅస్త్ర జూశ్రీఖుఎవతీ: చీశీ జూశ్రీఖుఝుఎశ్రీవ ంశీబతీషవం టశీబఅ% ప్రస్తుతం తాప్స హిందీలో 'జుడ్వా 2' అనే చిత్రంలో నటిస్తోంది. ఇందులో అమ్మడు బికినీ అందాలు ఆరబోసింది. తాప్సీ ఎక్స్ ఫోజింగ్ కాస్త ఓవర్ డోస్ అయిందనే విమర్శలు తెలుగు అభిమానుల నుండి వినిపిస్తున్నాయి. నేను బికినీ వేస్తే అదేదో పెద్ద నేరం అయినట్లు మాట్లాడుతున్నారు. సినిమాకు, నేను చేసే పాత్రకు అవసరం కాబట్టే బికినీ వేశాను అంటూ.... ఈ విషయంలో తనను ఆడిపోసుకుంటున్న వారికి తాప్సీ సమాధానం ఇచ్చింది. నామ్ శబానా సినిమాలో పాత్ర కోసం నేను చాలా వెయిట్ లాస్ అయ్యాను. తర్వాత 'జుడ్వా 2' సినిమాలో సెక్సీగా, గ్లామరస్ లుక్ తో కనిపించేందుకు వెయిట్ కొంచెం పెరగాల్సి వచ్చింది. ఇందుకోసం చాలా కష్టపడ్డాను. సినిమాలకు అవసరం అయ్యే పాత్ర కోసమే తాను ఇదంతా చేస్తున్నానని అందరూ అర్థం చేసుకోవాలి అని తాప్సీ అంటోంది. బాలీవుడ్లో తెరకెక్కుతున్న 'జుడ్వా 2'లో వరుణ్ ధావన్, తాప్సీ, జాక్వెలిన్ ఫెర్నాండెజ్ హీరో హీరో హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి డేవిడ్ ధావన్ దర్శకుడు. 1997లో వచ్చిన 'జుడ్వా' చిత్రానికి ఇది రీమేక్. అప్పట్లో వచ్చిన 'జుద్వా' చిత్రంలో సల్మాన్ ఖాన్ హీరోగా నటించగా...... డేవిడ్ ధావన్ దర్శకత్వం వహించారు. 23 ఏళ్ల తర్వాత అదే దర్శకుడు తన కొడుకు వరుణ్ ధావన్ హీరోగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు.

## బద్దకం వద్దు, చెర్రీని చూసి నేర్చుకోండి: ఉపాసన



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ భార్య ఉపాసన పోస్టు చేసిన ఓ వీడియో హాట్ టాపిక్ అయింది. రామ్ చరణ్ తన కుక్కపిల్లలతో కలిసి వాకింగ్ చేస్తున్న వీడియో ఆమె పోస్టు చేశారు. ఈ వీడియో ద్వారా అభిమానులకు హెల్తీ లైఫ్ స్టైల్ గురించి బోధించే ప్రయత్నం చేశారు ఉపాసన. ఉపాసన తన భర్తను ముద్దుగా మిస్టర్ సి అని పిలుస్తుందనే విషయం తెలిసిందే. టీచర్స్ డే సందర్భేగా ఉపాసన ఈ పోస్టు చేశారు. రామ్ చరణ్ నుండి అభిమానులు నేర్చుకోవాల్సిన అంశాలను ప్రస్తావించారు. ఈ వీడియో పోస్టు చేసిన ఆమె.... 'మిస్టర్ సి తనకు ఇష్టమైన వాటితో నడచివెళ్తున్నారు. హెల్తీ లైఫ్ స్టైల్‌కు కావాల్సిన లక్ష్యాలను మనకు నేర్పుతున్నారు. మన జీవనశైలిలో బద్ధకంగా ఉండటం ఓ వ్యాధి లాంటిదే. కాబట్టి, నడవండి' అని ఆమె పోస్టు చేశారు. రామ్ చరణ్‌ను పెళ్లాడిన సమయంలో కాస్త లావుగా ఉన్న ఉపాసన... తర్వాత చాలా మారింది. చెర్రీని చూసి ఇన్‌స్పైర్ అయి ఫిట్ నెస్ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటోంది.

## బాలయ్యా 103 మూవీ నాదే...



ఈ సమాజంలో ఎవరి విషయంలో అయినా మంచి కంటే చెడు ఎక్కువ ప్రచారం జరుగుతోంది. బాలయ్య విషయంలోనూ అలాంటి దుష్ప్రచారమే జరిగింది అని అభిప్రాయ పడ్డారు దర్శకుడు పూరి జగన్నాథ్. బాలయ్యతో ఆయన చేసిన 'పైసా వసూల్' చిత్రం మంచి వసూళ్లతో రన్ అవుతున్న నేపథ్యంలో ఆయన మీడియాతో ముచ్చటించారు. బాలయ్య ఎంతో క్రమశిక్షణ కలిగిన వ్యక్తి అని, ఆయనది ఎంతో మంచి మనసు అని..... బాలయ్యను దగ్గరగా చూస్తే ఎవరైనా లవ్‌లో పడిపోతారు. అంత జెన్యూన్ పర్సన్‌ని నేనింత వరకూ చూడలేదు. నేనే కాదు, మా యూనిట్‌లో అందరూ ఆయనతో లవ్‌లో పడిపోయారు అని పూరి తెలిపారు. నేను "బాలక ృష?గారూ" అంటే ఆయన ఒప్పుకోరు. "నో.. 'బాలా' అని పిలువ్" అంటా రు. ఆయనతో నాకు బాగా సింగ్ అయింది. ఆయన చాలా డిసిప్లిన్ గా, పంక్చువాలిటీతో ఉంటారు. నేను పని విషయంలో డిసిప్లిన్డ్‌గా ఉంటా....అందువల్ల ఆయనతో బాగా సింక్ అయింది అని పూరి తెలిపారు. బాలయ్య సెట్స్‌లో అందరితో చాలా జాలీగా ఉంటారు. రాగానే అందరినీ విష్ చేస్తారు. వెళ్లేపుడు అందరికీ బై చెప్పి వెళతారు. ఆయన గురించి చెప్పడానికి ఇలా చాలా విషయాలున్నాయి. కానీ వీటి గురించి ఎవరూ పట్టించుకోరు.... ఆయన ఎవర్నో కొట్టారనేది మాత్రం బాగా ప్రచారం చేస్తారు అని పూరి తెలిపారు. బాలయ్య చాలా ఎనర్జిటిక్ గా ఉంటారు. ఆయన యాక్షన్ సీన్లు చేసేప్పుడు మాత్రం భయపడేవాడ్ని. వెనుకా ముందూ చూసుకోకుండా దూకేస్తుంటారు. అలాంటప్పుడు ఆయనకు ఏమైనా అవుతుందేమోనని భయం ఉండేది అని పూరి చెప్పుకొచ్చారు. సినిమా 5 వారాల ముందు రిలీజ్ చేయడానికి కారణం... ఇతర సినిమాలకు ఇబ్బంది కలగకూడదని, తాము థియేటర్ల విషయంలో ఇబ్బంది పడకూడదనే. సినిమాకు మంచి రెస్పాన్స్ వస్తోందని తెలిపారు.

# మత్తు మందుల కేసులో కొత్త కోణం !

హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా పెనుదుమారం రేపడమే కాదు తెలుగు సినీపరిశ్రమను అతలాకుతలం చేసిన మత్తుమందుల వ్యవహారం ఇక ముగిసిన అధ్యాయమేనా! కొద్దిరోజులుగా ఈ కేసులో ఎలాంటి అలికిడీ లేకపోవడంతో అందరి మదిలో మెదులుతున్న అనుమానం ఇది. ఒత్తిడికి తలొగ్గి కేసు పక్కన పెట్టారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే బయట ప్రచారం ఎలా ఉన్నా మాదకద్రవ్యాల కేసులు దర్యాప్తునకు ఆబ్కారీశాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు తమపని తాము చేసుకుంటూ పోతున్నారు. హడావుడి లేకుండా దర్యాప్తు కొనసాగిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ఈ దర్యాప్తులో మరో ముగ్గురు సినీతారలకు కూడా మత్తు ముఠాతో సంబంధముందని గుర్తించినట్లు తెలుస్తోంది. చట్టబద్ధంగా వీరిపై చర్యలు తీసుకోవాలంటే మరికొన్ని ఆధారాలు కావాలి కాబట్టి ఆ దిశగా దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు సమాచారం. సరైన సమయంలో వీరిని కూడా పిలిపించి వాంగ్మూలం నమోదు చేసే ఆలోచనతో ఉన్నారు.

విదేశాల నుంచి ఎల్.ఎస్.డి. దిగుమతి చేసుకుంటూ సరఫరా చేస్తూ పట్టుబడ్డ కెల్విన్ ముఠాను విచారించినపుడు విస్తుగొలిపే వాస్తవాలు వెల్లడైన సంగతి తెలిసిందే. ఇందులో ప్రధానంగా తెలుగు సినీపరిశ్రమకు చెందిన పలువురు తారలకు కూడా కెల్విన్ మత్తుమందులు సరఫరా చేసినట్లు వెల్లడైంది. మొత్తం 11 మందిని ఆబ్కారీ అధికారులు విచారించారు. ఇది సంచలనం సృష్టించింది. దాంతో పరిస్థితి చక్కదిద్దేందుకు రంగంలోకి

## ఆధారాల సేకరణలో సిట్

దిగిన సినీపెద్దలు ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపారు. పరిశ్రమ పరువు పోతోందని వాపోయారు. ఆబ్కారీ అధికారులు విచారించిన 11 మందితో పాటు ఇంకా పలువురికి మత్తు మందులతో సంబంధం ఉందని, కానీ ఉన్నతస్థాయిలో వచ్చిన ఒత్తిళ్ల కారణంగా వారిని పక్కనపెట్టారనే వాదన తెరపైకి వచ్చింది. కొంతకాలంగా దర్యాప్తులో స్తబ్ధత నెలకొనడం కూడా అ అనుమానాలకు బలం చేకూర్చింది. బయట ఎన్నిరకాల వాదనలు వినిపిస్తున్నా ఆబ్కారీ అధికారులు మాత్రం తమపని తాము చేసుకుంటూ వెళుతున్నామని చెబుతున్నారు. సినీతారల విచారణలో వెల్లడైన అంశాలు, ఆ తర్వాత జరిగిన దర్యాప్తులో బయటపడ్డ విషయాల ఆధారంగా మరో ముగ్గురు సినీతారలు కూడా మత్తు వలలో చిక్కుకున్నట్లు గుర్తించారని సమాచారం.

### పెద్ద కుటుంబాల వారే..

ఈ ముగ్గురిలో ఒకరు ప్రముఖ హీరోయిన్ కాగా మరో ఇద్దరు తెలుగు సినీపరిశ్రమలో పెద్ద కుటుంబాలకు చెందిన వారున్నారని విశ్వసనీయ సమాచారం. అగ్ర హీరోయిన్‌లలో ఒకరుగా చలామణి అవుతున్న ఓనటి కొకైన్ వాడుతున్నట్లు తెలుస్తోంది. ఆమె మత్తుమందులు వాడుతుండగా తీసిన ఆరు వీడియో దృశ్యాలను ఆబ్కారీ అధికారులు సేకరించినట్లు తెలుస్తోంది. కొద్దిరోజుల క్రితం నిర్వహించిన ఒక సినీవేడుకలో



బహిరంగంగానే మత్తుమందులు తీసుకున్నట్లు, అదుపు తప్పి పడిపోతే మరో నటుడు ఆమెను తన కారులో తీసుకెళ్లి దింపినట్లు సమాచారం. మరో ఇద్దరు తారల పరిస్థితీ ఇదేనని, వీరిలో ఒక నటుడైతే పూర్తిగా మత్తు వూబిలో కూరుకొని పోయినట్లు తెలుస్తోంది. ఆబ్కారీ అధికారులు విచారించిన సినీ ప్రముఖుల్లో ఎక్కువ మంది ఈ ముగ్గురి పేర్లే చెప్పినట్లు తెలియవచ్చింది. దాని ఆధారంగానే పలు కీలక ఆధారాలు సేకరించినట్లు సమాచారం. ఇప్పుడున్న పరిస్థితుల ప్రకారం.. మరిన్ని పటిష్ఠ ఆధారాలు సేకరించి, తర్వాత రంగంలోకి దిగాలనే ఆలోచనతో అధికారులు ఉన్నారు. ప్రస్తుతం సిట్ అధికారులు దీనిపైనే దృష్టి కేంద్రీకరించినట్లు తెలుస్తోంది.

# సినిమా తరహాలో దొంగతనాలు

## వ్యసనాలకు బానిసైన విద్యార్థులు .. వివిధ ప్రాంతాల్లో బంగారు గొలుసుల చోరీలు

విజయవాడ : వ్యసనాలకు బానిసలైన కళాశాల యువకులు ఖర్చుల కోసం పక్కదారి పట్టారు. ఓ సినిమాలో చూపిన గొలుసు దొంగతనాలు స్ఫూర్తి నిచ్చాయి. మరో ఇద్దరు చిరుద్యోగులతో కలసి చోరీలకు పాల్పడుతున్నారు.

ఏలూరు, రామవరప్పాడు, గన్నవరం, ఎ.సీతారామపురం, హనుమాన్‌జంక్షన్, గుడివాడ ప్రాంతాల్లో దొంగతనాలు చేశారు. దీనికోసం ప్రత్యేకంగా ద్విచక్రవాహనం కొనుగోలు చేశారు. పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులను పట్టుకున్నారు.

న్యాయస్థానానికి హాజరుపరిచే ముందు కృష్ణాజిల్లా ఎస్పీ సర్వశ్రేష్ఠ త్రిపాఠీ ఆయా వివరాలను విలేకర్లకు వివరించారు.

పశ్చిమగోదావరి జిల్లా సత్రంపాడుకు చెందిన కల్లం భార్గవరెడ్డి డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. అల్లు విష్వక్ మరో కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు.

మద్యం అలవాటున్న వీరిద్దరికీ స్నేహం కుదిరింది. అదే గ్రామానికి చెందిన చిరుద్యోగి అట్లూరి పాత్రంకి కుమారస్వామి, తాపీ పని చేస్తున్న ఓ మైనర్ బాలుడు స్నేహితులయ్యారు. దురలవాట్లకు కావాల్సిన డబ్బు కోసం వెతుక్కుంటున్న సమయంలోనే ఈ నలుగురూ ఓ తమిళ డబ్బింగ్ సినిమా చూశారు.

అందులో వీరి వయసున్న యువకులే ద్విచక్రవాహనాలపై గొలుసు దొంగతనాలు చేసి విలాసంగా జీవిస్తుంటారు. ఆ స్ఫూర్తితో వీరు ఒకటి రెండు దొంగతనాలకు ప్రయత్నించారు. మొదటి ప్రయత్నాలు విజయవంతం కావడంతో.. ప్రత్యేకంగా ద్విచక్రవాహనాన్ని కొన్నారు.

తమ దొంగతనాల పరిధిని విస్తరించారు. వీరు చేసిన దొంగతనాల్లో రెండు హనుమాన్‌జంక్షన్ సర్కిల్ పరిధిలోకి రావడంతో సి.ఐ. జయకుమార్ వీటిపై దృష్టిసారించారు. ఎస్సై విజయకుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని పరిశోధనకు వినియోగించారు. సీసీ కెమెరాల్లో నమోదైన పుటేజీలను పరిశీలించారు. దొంగతనాలకు వినియోగించిన ద్విచక్రవాహనం.. సులువుగా గుర్తించే నమూనా కావడంతో పోలీసుల పని కొంత తేలికయ్యింది.

ద్విచక్రవాహన కంపెనీకి వెళితే అలాంటి వాహనాలు గత రెండు, మూడు నెలల్లో 250 అమ్మినట్లు గుర్తించారు. వాహనయజమానుల ఆచూకీ తీసి 50మంది జాబితాను అనుమానితులుగా నిర్ధారించారు.

వారిపై నిఘా పెట్టారు. వారి మొబైల్ సమాచారాన్ని విశ్లేషించారు. దొంగతనాలు జరిగిన సమయాల్లో, ఆయా ప్రాంతాల్లో ఉన్న మొబైల్ నంబర్ల ఆధారంగా నిందితులను గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకొని ప్రశ్నించడంతో వారు నేరాలను అంగీకరించారు. ఏలూరు, రామవరప్పాడు, గన్నవరం, ఎ.సీతారామపురం, హనుమాన్‌జంక్షన్, గుడివాడలో 15కాసులున్న ఆరు బంగారు గొలుసులు దొంగిలించారు. ఇటీవల గన్నవరంలో వరుస గొలుసు దొంగతనాలకు పాల్పడింది కూడా వీరే. ఆయా గొలుసులు, చోరీలకు వినియోగించిన ద్విచక్ర వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను న్యాయస్థానంలో హాజరుపరిచారు. నిందితులను చాకచక్యంగా పట్టుకున్న పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు. నగదు పోత్సహకం అందజేశారు.

# ఏడాది గరిష్టానికి పసిడి



ముంబై: గ్లోబల్ రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో బంగారం ధరలు మళ్లీ ఆకాశం వైపు చూస్తున్నాయి. ఇన్వెస్టర్ల కొనుగోళ్ళ కారణంగా డిమాండ్ బాగాపుంజుకోవడంతో ప్రపంచ వ్యాప్తంగా పసిడి ధరలు ఒక సంవత్సరం స్థాయికి చేరుకున్నాయి. దేశీయంగా కూడా ఇదే ధోరణి నెలకొంది. బంగారం ధరలు రూ. 30,500 (ఒక సంవత్సరం గరిష్టం) వైపు దూసుకుపోతున్నాయి.

ప్రపంచ బంగారం ధర గత ఏడాది సెప్టెంబరు 1,344.21 డాలర్లను తాకింది. నేడు గ్లోబల్ మార్కెట్లలో బంగారం ధరలు ఔన్స్ రోజుకు 1,339.87 డాలర్లవద్ద ఉంది. దేశీయ బంగారు ధరలు ప్రపంచ ధరలను అనుసరిస్తూ లాభాల్లో ట్రేడ్‌అవుతున్నాయి. ఎంసీఎక్స్ మార్కెట్ లో పది గ్రా పసిడి రూ. 15 ఎగిసి రూ. 30,238వద్ద స్థిరంగా కొనసాగుతోంది. అక్టోబర్ బంగారు ఫ్యూచర్స్ రూ. 30,230గా ఉంది. వెండి కేజీ డిసెంబర్ డెలివరీ కేజీ రూ. 41,421కు చేరింది.

నార్త్ కొరియా సృష్టిస్తున్న యుద్ధమేఘాలు, దేశీయంగా దిగుమతి సుంకం, డాలర్-రూపాయి విలువ కూడా దేశీయ బంగారు ధరలు ప్రభావితం చేస్తాయని మార్కెట్ వర్గాలు తెలిపాయి. త్తర కొరియా సంక్షోభం కొనసాగితే బంగారు ధరలు మరింత పుంజుకుంటాయని కొంతమంది విశ్లేషకుల అంచనా. ఈ సంక్షోభ పరిస్థితి కొనసాగిన ట్లయితే, భారతీయ మార్కెట్లలో ఫ్యూచర్స్ ధర 10 గ్రా. రూ.30,500 మార్కును అధిగమిస్తుందని ఏంజిల్ బ్రోకింగ్ ఎనలిస్టు ప్రథమేష్ మాల్య చెప్పారు. ఇదిలా ఉండగా డాలర్ మారకంలో రూపాయి విలువ మూడు వారాల కనిష్ఠానికి పడిపోయింది. రూ.0.7నష్టపోయి రూ.64.20 వద్ద ఉంది. అయితే దేశీయ స్టాక్‌మార్కెట్లు తీవ్రమైన ఊగిసలాట లమధ్య కొనసాగుతున్నాయి. ఒక దశలో 200 పాయింట్లను కోల్పోయిన సెన్సెక్స్ ప్రస్తుత 165 పాయింట్లు క్షీణించి 31, 645వద్ద నిఫ్టీ 44 పాయింట్లు నష్టపోయి 9908వద్ద ఉంది.

# శ్రీలంక వీధుల్లో కోహ్లీ గల్లీ క్రికెట్



కొలంబో: భారత క్రికెట్ జట్టు శ్రీలంకలో పర్యటిస్తోన్న సంగతి తెలిసిందే. మూడు టెస్టులు, ఐదు వన్డేల సిరీసలను దక్కించుకున్న కోహ్లీ సేన ఏకైక టీ-20లోనూ విజయం సాధించి హ్యాట్రిక్ స్వీప్‌పై దృష్టి పెట్టింది. ఇరు జట్ల మధ్య బుధవారం ఏకైక టీ20 జరగనుంది. ఐదు వన్డేల సిరీస్‌లో చివరి వన్డే ఆదివారం జరిగిన సంగతి తెలిసిందే. అనంతరం ఆటగాళ్లకు కాస్త తీరిక దొరకడంతో లంక వీధుల్లో చక్కెర్లు కొడుతున్నారు. ఈ క్రమంలో భారత క్రికెట్ జట్టు సారథి కోహ్లీ శ్రీలంక వీధుల్లో అభిమానులతో గల్లీ క్రికెట్ ఆడుతూ కనిపించాడు. కుడిచేతి వాటం బ్యాట్స్‌మెన్ అయిన కోహ్లీ ఇక్కడ ఎడమ చేత్తో బ్యాటింగ్ చేసి స్థానికులను అబ్బురుపరిచాడు. ఇందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు నెట్టింట్లో హల్‌చల్ చేస్తోంది. ఈ వీడియో చూసిన నెటిజన్లు కోహ్లీ ఏ చేత్తో అయినా బ్యాటింగ్ చేయగలడు, అతనికి ఆ సామర్థ్యం ఉంది అంటూ ప్రశంసలు కురిపించేస్తున్నారు.

# ఇంద్రకీలాద్రిపై కూలిన రిటైనింగ్ గోడ

## నాసిరకం పనులతో పాలకమండలి సభ్యుల ఆగ్రహం

ఇంద్రకీలాద్రి: ఇంద్రకీలాద్రిపై నిర్మాణంలో ఉన్న యాగశాల సమీపంలో వాటరు ట్యాంకు రిటైనింగ్ గోడ కూలిపోయింది.

వర్షం కురుస్తుండటంతో ఆ సమయంలో భక్తులు ఎవరూ అక్కడ లేకపోవడం వల్ల పెద్ద ప్రమాదం తప్పింది. రూ.లక్షలు వెచ్చించి వాటరు ట్యాంక్ రిటైనింగ్ గోడకు వర్టికల్ గార్డెన్ ఏర్పాటు చేసేందుకు మూడు నెలల క్రితం నిర్మాణం చేపట్టారు.

నాసిరకం పనులు, వర్షం కురవడంతో గోడ జారి 30 అడుగుల ఎత్తు నుంచి విరుచుకుపడింది. వర్టికల్ గార్డెన్ కోసం ఏర్పాటు చేసిన పనులు మూడు నెలల ముచ్చటగా మారాయి. గుత్తేదారుకు ఇష్టం వచ్చిన రీతిలో నాసిరకం పనులు చేయడమే కారణమని పాలకమండలి సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా సీవీ రెడ్డి ఛారిటీస్ స్థలంలో నిర్మాణంలో ప్రహరీ కూలిపోయిన సంగతి తెలిసిందే. తాజాగా రిటైనింగ్ గోడ కూలిపోవడం దుర్గగుడి అధికారుల పనితీరుకు అద్దం పడుతోంది.

రూ.లక్షలు వెచ్చించి నిర్మిస్తున్న నిర్మాణాలపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇటువంటి ఘటనలు జరుగుతున్నాయని పాలకమండలి సభ్యులు జి. పద్మశేఖర్, బి. ధర్మారావు ఆవేదన వ్యక్తం చేశారు.

ఇటువంటి ఘటనలు జరిగినప్పుడు సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోక పోవడంతో దుర్గగుడి ప్రతిష్ట మసకబారుతోందన్నారు. ఇప్పటికైనా దేవస్థానం ఈవో సూర్యకుమారి, ఈఈ భాస్కర్ వరుస సంఘటనలకు కారణమైన వారిపై చర్యలు తీసుకోకుంటే దేవస్థానం భారీ మొత్తంలో మూల్యం చెల్లించుకునే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు.

# మంత్రి అఖిలప్రియ సంతకం ఫోర్జరీ



అమరావతి: రాష్ట్ర పర్యాటక శాఖామంత్రి భూమా అఖిలప్రియకు షాకిచ్చాడు ఓ ప్రబుద్ధుడు. తప్పుడు సంతకంతో ఆమెను బురిడీ కొట్టించాలని ప్రయత్నించి చివరకు అడ్డంగా దొరికిపోయాడు. ఉద్యోగం కోసం ఏకంగా అఖిలప్రియ సంతకాన్నే ఓ లేఖ మీద ఫోర్జరీ చేసి, అంతటితో ఆగకుండా దానిని మంత్రి అఖిలకే అందజేశాడు. లేఖ చూసిన మంత్రి అవాక్కయ్యారు. అలీ అనే వ్యక్తికి వారం రోజుల్లో ఉద్యోగం ఇవ్వాలంటూ మంత్రి అఖిలప్రియ సిఫారసు చేసినట్లు ఆమె సంతకం ఫోర్జరీ చేసి ఉన్న లేఖ వచ్చినట్లు మంత్రి పేషీ సిబ్బంది ఎస్పీఎఫ్ కి ఫిర్యాదు చేశారు. పెదకూర పాడుకు చెందిన అలీ అనే వ్యక్తి ఈ దుశ్చర్యకు పాల్పడినట్లు తెలిపారు. ఈ పరిణామం మంత్రి పేషీలో కలకలం రేపింది. కేసు నమోదు చేసిన అధికారులు దర్యాప్తు చేపట్టారు.






# అనధికార ఆక్రమణల క్రమబద్ధీకరణకు చర్యలు

## త్వరలో 50 వేల మందికి పట్టాలు అందజేత .. అక్టోబర్ 2నాటికి ఓడీఎఫ్ జిల్లాగా కృష్ణా వీసీలో కలెక్టరు లక్ష్మీకాంతం

విజయవాడ : జిల్లాలో అనధికార ఆక్రమణలను క్రమబద్ధీకరిస్తున్నట్లు కలెక్టరు బి.లక్ష్మీకాంతం తెలిపారు. ఈక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా త్వరలో 50 వేల మందికి పట్టాలను పంపిణీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. నగరంలోని తమ విడిది కార్యాలయం నుంచి జిల్లాలో మండల, డివిజను అధికారులతో దూర దృశ్య, శ్రవణ సదస్సు (వీసీ) నిర్వహించారు.

పాఠశాలలు, కళాశాలల విద్యార్థులను జూనియరు/యువత రెడ్ క్రాస్‌లో సభ్యులుగా చేర్పించాలని సూచించారు. జిల్లాను అక్టోబరు 2 నాటికి బహిరంగ మలవిసర్జన రహిత (ఓడీఎఫ్) జిల్లాగా ప్రకటించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. 2018 జనవరి నాటికి రక్త హీనత రహిత జిల్లాగా ప్రకటించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ క్రమంలో గర్భిణులు, మహిళల్లో ఐరన్ లోపం నివారణకు 70 వేల మందికి హిమోగ్లోబిన్ వె%ద్య పరీక్షల నిర్వహణతో పాటు, నులిపురుగుల నివారణ మందులను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల అభివృద్ధికి స్వీకారం కార్యక్రమంలో భాగంగా దాతల సహకారం తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈనేపథ్యంలో ప్రభుత్వ నిధులు మంజూరు లేకుండా 300 పాఠశాలలు, 150 వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసినట్లు వివరించారు.

### ఆ మూడు గ్రామాల్లో నూరు శాతం సిమెంటు రహదారులు

జిల్లాలోని పెదపారుపూడి, నిమ్మకూరు, ఆత్కూరు గ్రామాల్లో నూరు శాతం సిమెంటు రహదారులు, పక్కా మురుగు కాల్వలు నిర్మించి నమూనా గ్రామాలుగా తీర్చిదిద్దనున్నట్టు కలెక్టరు తెలిపారు. మచిలీపట్నం గ్రామీణ మండలం చిన్నాపురం, నందిగామ మండలం జొన్నలగడ్డ గ్రామాల్లో ఎల్.ఇ.డి. బల్బులను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి పంచాయతీలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంటుకు పది సెంట్ల స్థలం కేటాయించాలని, ప్రతి ఇంటికి రెండు డస్ట్ బిన్నులను ఇవ్వాలన్నారు. అండన్‌వాడీ భవనాలకు అన్ని వసతులు కల్పిస్తున్నామని, అన్న అమృత హస్తం పథకం ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. జిల్లాలో విష జ్వరాలు, డెంగీ నివారణకు వైద్య శిబిరాలను నిర్వహించాలని, దోమల నివారణతో పాటు, తాగునీటిని కూడా పరీక్షించాలని సూచించారు.



Editor : Bete Sai Trilok, Printed and Published by Bete Chandra Sekhar on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published from D.No:58-3-15/1A, Atchamma Street, Patamata, Vijayawada-520 010, A.P. and Printed at **VIJAYABHANU PRESS,** D.No.9-3-17, Pithapuram Colony, Visakhapatnam -530 003, RNI No.APTEL/2008/24468, ☆ e-mail: vijayabhanudaily@gmail.com